

'పార్లమెంట్' వేళ ఉక్కు వేడి

- ఆరు దశాబ్దాల చరిత్ర.. ఎన్నికల నినాదమే కదా!
- మళ్లీ రాజకీయ తెరపైకి విభజన చట్టంలోని బయ్యారం కర్మాగారం
- మూడు ప్రధాన పార్టీల 'ఉక్కు ఉపాధి' గొంతుక



బయ్యారంలోని ఇనుపరాతి ఖనిజం గుట్ట

మహబూబాబాద్, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి) : అపార ఖనిజ సంపదతో విరాజిల్లుతున్న.. మహబూబాబాద్ ప్రాంతం ఎందుకు వెనుకబడింది..? ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లేక యువత ఎందుకు విలవిల్లాడుతున్నారు..? ఆరు దశాబ్దాల తెలంగాణ ఉద్యమం వెనుక నీళ్లు, నిధులు, నియామకాలు ఎందుకు కీలకమయ్యాయి ? లాంటి ప్రశ్నలు.. ఇంకా ప్రశ్నలుగా మిగిలాయి. మడిమ తిప్పని మలిదశ ఉద్యమ పోరాట ఫలితంగా కేంద్రంలోని నాటి యూపీఏ ప్రభుత్వం తెలంగాణ ఇవ్వడం.. ఉద్యమ, సాధన పార్టీగా బీఆర్ఎస్ పదేళ్లు పాలించినా.. ఉద్యమ ఆకాంక్ష మాత్రం నెరవేరినట్టు యువత అంగీకరించడం లేదు. ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల వైఫల్యాలను ఎండగడుతున్నారు. నాడు తెలంగాణ రాష్ట్ర సాధనోద్యమంలో కేసీఆర్ సహా ఉద్యమ నాయకత్వం సూటిగా ప్రశ్నించి నిరుద్యోగుల్లో ఆశలు కల్పించి ఆ తర్వాత దశాబ్ద కాల పాలనలో అదే అంశాన్ని ఎందుకు విస్మరణకు గురిచేసింది. స్వరాష్ట్రం సిద్ధించి పదేళ్లు దాటినా ఖనిజ సంపదకు పెట్టని కోటగా ఉన్న మానుకోట జిల్లాను పట్టించుకునే వారేలేరు. ఎన్నికలు వచ్చినప్పుడల్లా ఉక్కు పరిశ్రమ ఓ నినాదంగా మారి ఓట్లను కొల్లగొట్టే హామీగానే మిగిలిపోయింది. మళ్లీ ఈ లోక్‌సభ ఎన్నికల్లో ప్రధాన రాజకీయ పార్టీలు అవే అంశాలను అస్త్రంగా సంధించడానికి సన్నద్ధమవుతున్నాయి. స్వరాష్ట్రంలో మూడోసారి జరుగనున్న పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో మళ్లీ బయ్యారం ఉక్కు పరిశ్రమ సాధన అన్ని పార్టీలకు కీలకం కాబోతోంది.

ఉక్కు వెనక నడిచిన తతంగం ఇలా..

రాష్ట్ర పునర్విభజన చట్టంలోని తెలంగాణలో ఉక్కు పరిశ్రమ ఏర్పాటు హామీ నెరవేరకముందే కేంద్ర, రాష్ట్రాల పాలకుల పదేళ్ల పాలన దాటిపోయింది. తెలంగాణ రాష్ట్రానికి రావాల్సిన ఏకైక ఉక్కుపరిశ్రమ అంశాన్ని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మరుగున పడేశాయి. బయ్యారం ఇనుప ఖనిజం నిక్షేపాల వెలికితీతకు ఆరు దశాబ్దాల కిందటి చరిత్ర ఉంది. 1952లో తొలిసారిగా బయ్యారంలో మినీ ఉక్కు కర్మాగారం ఏర్పాటు చేసి, కొంతకాలం పాటు ఇనుప ఖనిజాన్ని వెలికితీశారు. అలా వెలికితీసిన ఖనిజాన్ని ఇతర రాష్ట్రాలతో పాటు జపాన్‌కు ఎగుమతి చేసేవారు. అనంతరం ఏ కారణం చేతనో ఇనుప ఖనిజం వెలికితీత పనులు నిలిచిపోగా, ఉమ్మడి రాష్ట్రంలో ముఖ్యమంత్రి వైఎస్సార్ ప్రభుత్వ హయాంలో 2004 నుంచి 2009 వరకు ఐదేళ్ల పాటు ఖనిజాన్ని మళ్లీ వెలికితీసి ఇతర ప్రాంతాలకు ఎగుమతి చేశారు. తెలంగాణ ఉద్యమ సమయంలో బయ్యారం ఉక్కు అంశం కీలకంగా మారడంతో అప్పటి యూపీఏ ప్రభుత్వం రాష్ట్ర విభజన చట్టంలో ఖమ్మం జిల్లాలో స్టీల్ పరిశ్రమ ఏర్పాటు అంశాన్ని జోడించింది. ఆ దిశగా కేంద్ర, రాష్ట్రప్రభుత్వాలు పలుమార్లు సర్వేలు జరిపారు. పలు సంస్థలు చేపట్టిన సర్వేల్లో కూడా స్టీల్ ప్లాంట్ ఏర్పాటు దిశగానే సానుకూల నివేదిక వచ్చినట్లు ప్రకటనలు ఊరించాయి.

పూర్వ తెలంగాణ సర్కార్.. ఏదో చేస్తానని..

స్వరాష్ట్ర ఆవిర్భావం నుంచి ఉక్కు ఫ్యాక్టరీపై నానుస్తూ వచ్చిన కేంద్రం కుదరదని సుప్రీంకోర్టులో తేల్చిచెప్పడంతో గత సీఎం కేసీఆర్, నాటి మంత్రి కేటీఆర్, ఇతరత్రా ప్రజాప్రతినిధులు కేంద్రం ఒప్పుకున్నా లేకున్నా ఎట్టి పరిస్థితుల్లో ఉక్కు ఫ్యాక్టరీ నిర్మాణం చేపట్టి తీరుతామంటూ ప్రకటనలు చేశారు. సింగరేణి సంస్థతో పాటు టీఎస్ఎండీసీతో ఖనిజ నాణ్యత, పరిమాణంపై సర్వేలు కూడా చేయించారు. ఇక్కడ సరిపడా ఖనిజం లేకపోయినా పక్క రాష్ట్రం ఛత్తీస్‌గఢ్ బైలడిల్లా నుంచైనా సరే ముడి సరుకును దిగుమతి చేసుకొని బయ్యారంలో ఫ్యాక్టరీ ఏర్పాటు చేసి తీరుతామని హామీలు గుప్పించారు. ఒకానొక సందర్భంలో హైదరాబాద్ వచ్చిన కేంద్రం మంత్రి బీరేందర్‌సింగ్ కూడా తెలంగాణ వాదులకు తీపి కబురంటూ ఖమ్మం జిల్లా స్టీల్ ఫ్యాక్టరీపై ఊరించేలా ప్రకటనలు చేశారు. కానీ, అదంతా ఉత్తుత్తే అయిపోయింది. సుమారు 300 మిలియన్ మెట్రిక్ టన్నుల అపార ఇనుప ఖనిజ నిక్షేపాలు బయ్యారంలో ఉన్నాయన్న జియాలజికల్ సర్వే ఆఫ్ ఇండియా నివేదికలు ఉన్నా కేంద్రం నాణ్యమైన ఐరన్‌ఓర్ బయ్యారంలో లేదని చెప్పడంతో ఉక్కు సంకల్పం ఉట్టికెక్కింది.

లోక్‌సభ ఎన్నికల వేడిలో.. బయ్యారం ఉక్కు..

స్వరాష్ట్రంలో మూడోసారి పార్లమెంట్ ఎన్నికల వేడిలో 'ఉక్కు పరిశ్రమ' హామీ రాజుకుంటోంది. దశాబ్దకాలం తర్వాత తెలంగాణలో అధికారం చేపట్టిన కాంగ్రెస్ మహబూబాబాద్ లోక్‌సభ ఎన్నికల్లో బయ్యారం ఉక్కు సాధనపై దృష్టిపెడుతోంది. కేంద్రంలో కాంగ్రెస్ అధికారం చేపడితేనే తెలంగాణలో ఉక్కుపరిశ్రమ ద్వార ఉపాధి అవకాశాలు పెంపొందించుకోగలమని స్పష్టం చేస్తోంది. ఎన్నికల షెడ్యూల్ ప్రకటనతోనే రంగంలో దిగిన మహబూబాబాద్ పార్లమెంట్ కాంగ్రెస్ అభ్యర్థి, మాజీ కేంద్ర మంత్రి పోరిక బలరాంనాయక్ తాము అధికారంలో ఉన్నప్పుడు పార్లమెంట్ పరిధిలో చేసిన అభివృద్ధిని ప్రస్తావించడంతో పాటు మళ్లీ అధికారంలోకి రాగానే ఉక్కు పరిశ్రమ హామీ ప్రధానంగా తీసుకుంటానంటూ యువతలో ఆశలు కల్పిస్తున్నారు. ఇక సిట్టింగ్ ఎంపీ, బీఆర్ఎస్ అభ్యర్థి మాలోతు కవిత కూడా తన ప్రయత్నంతోనే ములుగులో గిరిజన యూనివర్సిటీ సాకారమైందని చెబుతూనే మళ్లీ అధికారంలోకి రాగానే ఉక్కు పరిశ్రమతో పాటు ఇంకా అనేక యువత ఉపాధి అవకాశాలు, నిరుద్యోగ సమస్య తీర్చడంతో పాటు వివిధ అభివృద్ధి పథకాలు తీసుకువస్తానంటూ ప్రచారం ఊదరగొడుతున్నారు. బీజేపీ అభ్యర్థి మాజీ ఎంపీ, ఉద్యమనేత, ప్రొఫెసర్ అజ్మీర సీతారాంనాయక్ సైతం తానేం తక్కువ కాదంటూ గతంలో తాను చేసిన ప్రయత్నాల వల్ల తెలంగాణలో ఎంతో అభివృద్ధి జరిగిందని, పార్లమెంటరీ పరిధిలో అనేక అభివృద్ధి సంక్షేమ పథకాలు తెచ్చానని, ఇంకా తెలంగాణకు అవసరమైన బయ్యారం ఉక్కుతో పాటు నిరుద్యోగులకు ఉపాధి అవకాశాలు కల్పించేందుకు పాటుపడతానని స్పష్టం చే స్తున్నారు. ఇంకా బరిలో దిగనున్న అభ్యర్థులు కూడా బయ్యారం ఉక్కునే ఎన్నికల ప్రధాన అస్త్రంగా సంధించే అవకాశాలున్నాయి.



బయ్యారం గుట్ట నుంచి సేకరించిన ఇనుప ఖనిజపు రాళ్లు (ఫైల్)

ఉత్పత్తులతో మానుకోట మార్కెట్ కళకళ



మహబూబాబాద్ మార్కెట్ యార్డులో ధాన్యం రాసులు

మహబూబాబాద్ అగ్రికల్చర్, ఏప్రిల్23 : మహబూబాబాద్ వ్యవసాయ మార్కెట్‌కు ధాన్యం రాసులతో పాటు మొక్కజొన్నలు, మిర్చి రాబడులతో మంగళవారం మార్కెట్ కళకళలాడింది. ధాన్యం 15 వేల బస్తాలకుపైగా అమ్మకానికి వచ్చింది. అయితే సోమవారం 10 వేల బస్తాలు రావడంతో అందులో 5 వేల బస్తాల వరకే కాంటాలు పూర్తయ్యాయి. ఇంకా 5 వేల బస్తాలు మిగిలిపోయాయి. ఎండల తీవ్రతతో కూలీలు, హమాలీలు కాంటాలు పెట్టడం ఆలస్యమవుతోంది. మిగిలిన బస్తాలతో పాటు రాత్రి మరో 10 వేలబస్తాలు వచ్చాయి. మొత్తం 15 వేల బస్తాలు ప్రస్తుతం మార్కెట్‌లో ఉన్నాయి. అలాగే 10 వేలబస్తాల వరకు మొక్కజొన్నలు ఉన్నాయి. 2 వేల బస్తాల వరకు మిర్చి ఉంది.

నేడు మార్కెట్ బంద్..

మహబూబాబాద్ వ్యవసాయ మార్కెట్ యార్డు మొత్తం ధాన్యంతో నిండిపోయి ఉందని, కాంటాలకు ఆలస్యమవుతున్నందున బుధవారం మార్కెట్‌కు సెలవు ప్రకటించినట్లు కార్యదర్శి శంషీర్ తెలిపారు. రైతులు సహకరించాలని కోరారు.



నేడు వరంగల్‌లో జనజాతర సభ

- హాజరవనున్న సీఎం రేవంత్‌రెడ్డి



సభా స్థలాన్ని పరిశీలిస్తున్న ఎమ్మెల్యేలు కేఆర్ నాగరాజు, కడియం శ్రీహరి, తదితరులు

(ఆంధ్రజ్యోతి ప్రతినిధి -వరంగల్)

కాంగ్రెస్ అభ్యర్థుల విజయమే లక్ష్యంగా సీఎం రేవంత్‌రెడ్డి విస్తృతంగా ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్నారు. బుధవారం వరంగల్ లోక్‌సభ అభ్యర్థి కడియం కావ్య నామినేషన్ కార్యక్రమానికి హాజరవనున్న సీఎం రేవంత్‌రెడ్డి సాయంత్రం 4 గంటలకు మడికొండలో జరిగే జనజాతర బహిరంగసభలో ప్రసంగిస్తారు. వరంగల్ పశ్చిమ, స్టేషన్‌ఘన్‌పూర్, వర్ధన్నపేట నియోజకవర్గాలతో పాటు పొరుగున ఉన్న ఇతర మండలాల నుంచి కార్యకర్తలను ఈ సభకు భారీగా తరలించేందుకు కాంగ్రెస్ నేతలు ఏర్పాట్లు చేస్తున్నారు. అలాగే కాంగ్రెస్ పార్టీ పాంచ్ న్యాయ్ పథకాలతో పాటు ఉమ్మడి వరంగల్‌కు సీఎం రేవంత్‌రెడ్డి అనేక హామీలు ఇచ్చే అవకాశం ఉందని సమాచారం. ముఖ్యంగా వరంగల్, హనుమకొండ జిల్లాల విలీనంపై ప్రకటన చేసే అవకాశం ఉందని,

మిగతా 8వ పేజీలో

బీఆర్ఎస్ వరంగల్ తూర్పు నియోజకవర్గ స్థాయి సభకు హాజరైన పార్టీ శ్రేణులు



మాట్లాడుతున్న కేటీఆర్

మోసపూరిత హామీలతో రేవంత్ గద్దెనెక్కారు

- ఈ ఎన్నికల్లో ఆయనకు బుద్ధి చెప్పాలి
- కడియం.. నయవంచకుడు, విశ్వాసఘాతకుడు
- మోదీ పిరమయ్యాడు.. ఓటుతో బీజేపీ, కాంగ్రెస్‌లను తొక్కెయ్యాలి
- బీఆర్ఎస్ 10 పార్లమెంట్ సీట్లు గెలిస్తే కేసీఆర్ రాజకీయాలను శాసిస్తారు
- వరంగల్ తూర్పు, వర్ధన్నపేట సమావేశాల్లో కేటీఆర్

7 లో..

పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్‌కు బుద్ధి చెప్పాలి

- గత హామీలను విస్మరించిన పార్టీని ఓడించాలి
- మీ ఇంటి ఆడబిడ్డగా నన్ను ఆశీర్వదించాలి
- మానుకోట బీఆర్ఎస్ అభ్యర్థి మాలోతు కవిత



కార్యకర్తల సమావేశంలో మాట్లాడుతున్న మాలోతు కవిత

మహబూబాబాద్ టౌన్, ఏప్రిల్ 23 : ఎన్నికల హామీలను తుంగలో తొక్కి, మరోసారి ప్రజలను మోసం చేసేందుకు ప్రయత్నిస్తున్న కాంగ్రెస్‌ను పార్లమెంట్ ఎన్నికల్లో ఓడించి.. తగిన బుద్ధి చెప్పాలని మానుకోట బీఆర్ఎస్ అభ్యర్థి, ఎంపీ మాలోతు కవిత పిలుపునిచ్చారు. మహబూబాబాద్ ఎంపీ క్యాంపు కార్యాలయం ఎదుట పార్లమెంటరీ నియోజకవర్గ బీఆర్ఎస్ కార్యకర్తల సమావేశాన్ని మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వంపై విశ్వాసం సన్నగిల్లిందని, అందుకు ఉదాహరణ మానుకోటలో సీఎం రేవంత్‌రెడ్డి సభనేనని చెప్పారు. జనం కోసం సీఎం ఎదురు చూడడం దేశంలో ఎక్కడా చూడలేదన్నారు. తనపై తనకు నమ్మకం లేక సీఎం దేవుడిపై ఒట్టేసి రుణమాఫీ చేస్తానని చెప్పడం దారుణమన్నారు.

కాంగ్రెస్ వారు దేవుడిమీద ఒట్టేసి ఓట్లు అడుగుతుండగా, బీజేపీ నేతలు దేవుడి పేరు చెప్పి ఓట్లు అడుగుతున్నారన్నారు. నా విశ్వాసం.. నా బలం, నా బలగం బీఆర్ఎస్ శ్రేణులేనని చెప్పారు. ప్రజా గొంతుక బీఆర్ఎస్ ఎంపీలను గెలిపించుకోవాలని కోరారు. మీ ఇంటి ఆడబిడ్డగా తనను ఆశీర్వదించి పార్లమెంట్‌కు పంపిస్తే ప్రజలపక్షాన పోరాడుతానని స్పష్టం చేశారు.

బీఆర్ఎస్ పాలనలో అనేక సంక్షేమ పథకాలు

- రాజ్యసభ సభ్యుడు రవిచంద్ర

తెలంగాణ రాష్ట్రంలో మాజీ సీఎం కేసీఆర్ పాలనలో ఎక్కడా లేనివిధంగా అనేక సంక్షేమ పథకాలు అమల య్యాయని రాజ్యసభ సభ్యుడు వద్దిరాజు రవిచంద్ర అన్నారు. బీఆర్ఎస్ పాలనలో ఎండకాలం కూడా చెరువులు మత్తళ్లు పోశాయని, 2014 కంటే ముందు రాష్ట్రంలో 30లక్షల టన్నుల వరి పంట పండితే.. ఆ తర్వాత క్రమేనా 3కోట్ల టన్నుల ధాన్యం దిగుబడి అయిందని, వరిలో దేశంలో పంజాబ్ రాష్ట్రం తర్వాత తెలంగాణ ద్వితీయ స్థానానికి చేరుకుందని గుర్తు చేశారు. ఎమ్మెల్సీ సత్యవతిరాథోడ్ మాట్లాడుతూ గిరిజన జిల్లా మానుకోట అభివృద్ధికి కేసీఆర్ వందల కోట్ల నిధులిచ్చారని చెప్పారు. ఎమ్మెల్సీ తక్కెళ్లపల్లి రవీందర్‌రావు మాట్లాడుతూ కాంగ్రెస్ నాయకులు నోరు అదుపులో పెట్టుకుని మాట్లాడాలని ఇష్టారీతిన మాట్లాడితే సహించేది లేదన్నారు. మానుకోట, ములుగు జడ్పీచైర్‌పర్సన్‌లు అంగోతు బిందు, బడెటి నాగజ్యోతి, మాజీ ఎమ్మెల్యేలు డీఎస్.రెడ్యానాయక్, బానోత్ శంకర్‌నాయక్, రేగ కాంతారావు, పెద్ది సుదర్శన్‌రెడ్డి, హరిప్రియ, మునిసిపల్ చైర్మన్ రాం మోహన్‌రెడ్డి, వైస్ చైర్మన్ మార్నేని వెంకన్న, పర్కాల శ్రీనివాస్‌రెడ్డి, బానోత్ రవికుమార్, డీఎస్. రవిచంద్ర, మర్రి రంగారావు, బీరవెళ్లి భరత్‌కుమార్‌రెడ్డి, కేఎస్ ఎన్.రెడ్డి, ముత్యం వెంకన్న, ఎమ్డి. ఫరీద్, అయూబ్, బూర్ల ప్రభాకర్‌గౌడ్ పాల్గొన్నారు.

బయటపడిన వర్గపోరు..

మహబూబాబాద్‌లో బీఆర్ఎస్ వర్గపోరు మరోమారు బయట పడింది. బీఆర్ఎస్ అభ్యర్థిగా ఎంపీ కవిత నామినేషన్ వేసిన అనంతరం పట్టణంలోని ఎంపీ క్యాంపు కార్యాలయం వద్ద కార్యకర్తల సమావేశాన్ని నిర్వహించారు. మాజీ ఎమ్మెల్యే బానోత్ శంకర్‌నాయక్ ప్రసంగిస్తూ అసెంబ్లీ ఎన్నికల్లో చేసిన తప్పులు మళ్లీ చేయవద్దని. తల్లిపాలు తాగి రొమ్ముగుద్దిన చందంగా పార్టీలో ఉంటూ వెన్నుపోటు పొడవద్దని మాట్లాడుతుండగా ఎమ్మెల్సీ రవీందర్‌రావు అనుచరులు ఇప్పుడెందుకు ఆ విషయాలని, ఎవరూ మోసం చేశారని సమావేశ ఉద్దేశం చెప్పాలని అన్నారు. గత విషయాలు ఎందుకు మాట్లాడవద్దని శంకర్‌నాయక్ అనుచరులు అన్నారు. మాజీ ఎమ్మెల్యే శంకర్‌నాయక్ సైతం కొట్లాడు కుందామంటే, కొట్లాడుకుందాం.. నో ప్రాబ్లమ్ అంటుండగానే ఇరువర్గాల మధ్య ఉద్రిక్తత పరిస్థితులు నెలకొన్నాయి. ఒక దశలో రవీందర్‌రావు అనుచరులకు, మాజీ ఎమ్మెల్యే శంకర్‌నాయక్ అనుచరుల మధ్య వాగ్వాద తీవ్రత పెరుగుతుండడంతో ఎంపీ కవిత, శంకర్‌నాయక్ చేతిలో మైకు తీసుకుని జైతెలంగాణ.. కేసీఆర్ నాయకత్వం వర్ధిల్లాలి అంటూ నినదిస్తూ పరిస్థితులను చక్కదిద్దే ప్రయత్నం చేశారు. తరువాత ఎంపీ కవిత, శంకర్‌నాయక్‌కు మళ్లీ మైక్ ఇవ్వడంతో యథావిధిగా ప్రసంగం కొనసాగించారు.

నేడు ఇంటర్ ఫలితాలు

- తేలనున్న 9,469 మంది విద్యార్థుల భవితవ్యం

మహబూబాబాద్ ఎడ్యుకేషన్, ఏప్రిల్ 23 : ప్రభుత్వం బుధవారం ఇంటర్మీడియట్ ప్రథమ, ద్వితీయ సంవత్సరం విద్యార్థుల వార్షిక పరీక్షల ఫలితాలను విడుదల చేయనుంది. దీంతో మహబూబాబాద్ జిల్లాలో పరీక్షకు హాజరైన 9,469 మంది విద్యార్థుల భవితవ్యం తేలనుంది. ఫిబ్రవరి 28న ప్రారంభమైన ఈ పరీక్షలు మార్చి 19న ముగిశాయి. జిల్లా వ్యాప్తంగా ప్రథమ సంవత్సరంజనరల్ విద్యార్థులు 3,329 మంది కాగా, ఒకేషనల్‌లో 1,231 మంది విద్యార్థులు, ద్వితీయ సంవత్సరం జనరల్ విద్యార్థులు 3,685, ఒకేషనల్ విద్యార్థులు 1224 వెరసీ మొత్తం 9,469 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరయ్యారు. అందుకుగాను 19 పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేసి ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు పరీక్షలు నిర్వహించారు. కాగా, వార్షిక ఫలితాలు వెలువడుతాయనే ప్రకటనలతో విద్యార్థులు, తల్లిదండ్రుల్లో ఉత్కంఠ నెలకొంది.

ఘనంగా శ్రీహనుమాన్ జయంతి




హనుమాన్ హిల్స్ ఆలయంలో పూజలు చేస్తున్న ఎమ్మెల్యే మురళీనాయక్, ఎమ్మెల్సీ రవీందర్‌రావు

మహబూబాబాద్ ఎడ్యుకేషన్, ఏప్రిల్ 23 : జిల్లా కేంద్రం నర్సంపేట రోడ్డులోని హనుమాన్ హిల్స్ ఆలయంలో శ్రీహనుమాన్ జయంతిని మంగళవారం ఘనంగా జరుపుకున్నారు. గాయత్రిగుట్ట సమీపంలోని హనుమాన్ హిల్స్ ఆలయంలో స్థానిక శాసన సభ్యుడు భూక్య మురళీనాయక్, ఎమ్మెల్సీ తక్కెళ్లపల్లి రవీందర్‌రావు, మునిసిపల్ చైర్మన్ పాల్వాయి రామ్మోహన్‌రెడ్డి శ్రీఅభయాంజనేయస్వామి ఆలయంలో స్వామి వారికి ప్రత్యేక పూజలు చేసి ఆలయ నిర్మాణం, హనుమాన్ విగ్రహం మొదలగు ప్రతిపాదిత పనులకు సంబంధించిన కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మురళీనాయక్ మాట్లాడుతూ ఆపత్కాలంలో శ్రీఆంజనేయస్వామిని తలుచుకుంటే మనోధైర్యం కలుగుతుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మునిసిపల్ ఫ్లోర్ లీడర్ చిట్యాల జనార్దన్, వార్డు కౌన్సిలర్ బానోత్‌పద్మాసీతారాంనాయక్, ఎడ్ల వేణుమాధవ్, ఎడ్ల రమేష్, మంగళంపెల్లి కన్నా, గోగుల రాజు, అంబాల శివకుమార్, దేవాలయ ట్రస్టు కాశెట్టి లక్ష్మణ్, అనుమాల వెంకటేశ్వర్లు, లక్ష్మీనారాయణ, గోపాల్ గిలాడ, జంగాల మంగపతిరావు, మాధవపెద్ది వెంకట్‌రెడ్డి, అంగోతు శ్రీనివాస్ పాల్గొన్నారు.

- డోర్నకల్ : మునిసిపల్ కేంద్రంలో హనుమాన్ జయంతిని ఘనంగా నిర్వహించారు. హనుమాన్ మందిరంలో ప్రత్యేక పూజలు చేసిన భక్తులు ర్యాలీ నిర్వహించారు. ఈకార్యక్రమంలో ముల్‌చంద్ మాల్వాని, సత్యనారాయణలడ్డా, రమాకాంత్, ద్వారక, భగవాన్, వేణు, విజయ్‌కుమార్, శ్యామ్, గోపాల్ పాల్గొన్నారు.
- బయ్యారం : బయ్యారంలో హనుమాన్ జయంతి సందర్భంగా భక్తులు బైక్‌ర్యాలీ నిర్వహించారు. స్థానిక ప్రభుత్వ ఆస్పత్రి నుంచి బయ్యారం వీధుల్లో ఈ ర్యాలీ కొనసాగింది. ఈ సందర్భంగా భక్తులకు భగవద్గీత సారాంశం పుస్తకాలను ఉచితంగా పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఉపేంద్రాచారి, సతీష్, రమేష్, సురేష్, నరేందర్, గణేష్, సుమన్, శ్రీను పాల్గొన్నారు.

మత్తు పదార్థాల నుంచి యువతను కాపాడుకుందాం

- ఎస్పీ సుధీర్‌రామ్‌నాథ్‌కేకన్



గంజాయి, కల్తీకల్లు నిర్మూలన వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న సుధీర్‌రామ్‌నాథ్ కేకన్

మహబూబాబాద్ రూరల్, ఏప్రిల్ 23 : యువత మత్తుపదార్థాలకు బానిస కాకుండా కాపాడుకుందామని ఎస్పీ సుధీర్‌రామ్‌నాథ్ కేకన్ పిలుపునిచ్చారు. మహబూబాబాద్ టౌన్ పోలీస్‌స్టేషన్ తెలంగాణ రాష్ట్ర యాంటి నార్కోటిక్స్ బ్యూరో ఆధ్వర్యంలో మంగళవారం గంజాయి, కల్తీ వినియోగం జరిగే అనర్థాలపై రూపొందించిన వాల్‌పోస్టర్లను మంగళవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో గంజాయితో పాటు కల్తీకల్లు వినియోగం ద్వారా వ్యక్తులతో పాటు సమాజానికి జరిగే నష్టాన్ని తెలిపే రీతిలో రూపొందించిన వాల్‌పోస్టర్లలో గంజాయి, కల్తీకల్లు విక్రయాలకు పాల్పడితే ఫిర్యాదు చేయాల్సిన టోల్ ఫ్రీనెంబర్లతో ఈ అవగాహన పోస్టర్లను రూపొందించినట్లు వివరించారు. గంజాయి మహమ్మారి యువతను పట్టి పీడిస్తోందని, దీంతో వారి జీవితాలు విచ్ఛిన్నం కావడంతో పాటు తల్లిదండ్రులు మానసికక్షోభకు గురవుతున్నారని చెప్పారు. గంజాయి నిర్మూలనకు ప్రజలందరూ స్వచ్ఛందంగా ముందుకు వచ్చి మత్తు పదార్థాల విక్రయాలకు పాల్పడే వారి సమాచారం అందించాలని విజ్ఞప్తి చేశారు. మత్తుపదార్థాల కట్టడి కోసం పోలీస్ అధికారులు మరింత శ్రమించాల్సి ఉందన్నారు. గంజాయి రహిత జిల్లానే మనందరి లక్ష్యమని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఏఎస్పీ జోగుల చెన్నయ్య, టాస్క్‌ఫోర్స్ డీఎస్పీ గంద్రాతి మోహన్, సైబర్ క్రైమ్ డీఎస్పీ సత్యనారాయణ, మరిపెడ సీఐ హత్తిరాంనాయక్, తొర్రూరు సీఐ సంజీవ పాల్గొన్నారు.

ట్రాన్స్‌ఫార్మర్లు, కాపర్‌వైర్ దొంగల అరెస్టు

హసన్‌పర్తి, ఏప్రిల్ 23: చాలా రోజుల నుంచి తప్పించుకుని తిరుగుతూ వివిధ పోలీస్‌స్టేషన్ల పరిధిలోని ట్రాన్స్‌ఫార్మర్లు, కాపర్‌వైర్, మోటార్లు, ఇనుప సామగ్రిని దొంగిలించిన ఏడుగురు నిందితులను మంగళవారం హసన్‌పర్తి పోలీసులు అరెస్టు చేశారు. ఇన్స్‌పెక్టర్ జవ్వాజీ సురేష్ తెలిపిన వివరాల ప్రకారం.. వడ్డెపల్లి చర్చి ప్రాంతంలోని పూరిగుట్టకు చెందిన భూక్య రమేశ్, బోడ రాజేందర్, వాంకుడోతు రాజ్‌కుమార్, గోపగాని ప్రశాంత్, అంబి సురేష్, భూక్య నరేష్, బోడ వినోద్‌కుమార్ డబ్బును సంపాదించాలనే ఉద్దేశంతో పోలీస్‌స్టేషన్ల పరిధిలోని వ్యవసాయ బావుల వద్ద మోటార్లను, విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లను, వాటిలోని కాపర్ వైర్లను, ఇనుప సామగ్రిలను దొంగతనాలు చేస్తుడేవారు. మంగళవారం హసన్‌పర్తి పోలీసులు బావుపేట క్రాస్‌రోడ్డు వద్ద వాహనాల తనిఖీ చేస్తున్నారు. ఈ క్రమంలో ఒక ఆటోలో నలుగురు దొంగిలించిన సామానుతో, మరో ముగ్గురు స్కూటీపై వెళ్తున్నారు. ఆటో, స్కూటీలను ఆపమని అడుగగా తప్పించుకునే ప్రయత్నం చేశారు. పోలీసులు వారిని వెంబడించి పట్టుకుని తనిఖీ చేశారు. అందులో దొంగిలించిన వస్తువులు ఉన్నాయి. వారిని అదుపులోకి తీసుకుని విచారించగా ఆ సామన్లను తామే దొంగిలించామని ఒప్పుకున్నారు. ఎల్కతుర్తి పోలీస్‌స్టేషన్ పరిధిలో ఐదు ట్రాన్స్‌ఫార్మర్లు, కమలాపూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో మూడు ట్రాన్స్‌ఫార్మర్లు, కేయూ పోలీస్‌స్టేషన్ పరిధిలో రెండు ట్రాన్స్‌ఫార్మర్లు, ఒక ఇనుపగేటు, హసన్‌పర్తి పోలీస్‌స్టేషన్ పరిధిలో మోటార్లు, ఇనుప సామాన్లు దొంగతనం చేసినట్టు ఒప్పుకున్నారు. వస్తువులను స్వాధీనం చేసుకుని, ఏడుగురిపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు పంపినట్లు ఇన్స్‌పెక్టర్ తెలిపారు. దొంగలను పట్టుకోవడంలో ప్రతిభ కనబరిచిన ఇన్స్‌పెక్టర్ జవ్వాజీ సురేష్, సబ్ ఇన్స్‌పెక్టర్ రాజు, క్రైం కానిస్టేబుల్ క్రాంతి కుమార్, మధు, ఐటీ కోర్ ఏఏవో సల్మాన్ పాషా, నగేష్‌లను సీపీ అంబర్ కిషోర్ ఝూ, ఏసీపీ అభినందించారు.

ఓపెన్ పరీక్షలను పకడ్బందీగా నిర్వహించాలి

హనుమకొండ డీఈవో డాక్టర్ ఎం.డి. అబ్దుల్‌హై



సమావేశంలో మాట్లాడుతున్న డీఈవో డాక్టర్ అబ్దుల్ హై

వరంగల్ ఎడ్యుకేషన్, ఏప్రిల్ 23: తెలంగాణ సార్వత్రిక విద్యాపీఠం ఆధ్వర్యంలో ఈ నెల 25 నుంచి ప్రారంభం కానున్న తెలంగాణ ఓపెన్ స్కూల్ ఓపెన్ టెన్త్, ఇంటర్ వార్షిక పరీక్షలను పకడ్బందీగా నిర్వహించాలని హనుమకొండ డీఈవో డాక్టర్ ఎం.డి. అబ్దుల్‌హై అన్నారు. ఓపెన్ స్కూల్ ఉమ్మడి జిల్లా కోఆర్డినేటర్ మురాల శంకర్‌రావు ఆధ్వర్యంలో మంగళవారం డీఈవో కార్యాలయంలో ఓపెన్ స్కూల్ పరీక్షల సీఎస్, డీవోలతో పరీక్షల సన్నాహక సమావేశం జరిగింది. ఈ సందర్భంగా డీఈవో డాక్టర్ అబ్దుల్‌హై మాట్లా డుతూ.. పరీక్షలకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామన్నారు. ఎక్కడ ఎలాంటి అవా ంఛనీయ సంఘటనలు జరుగకుండా అన్ని చర్యలు తీసుకుంటు న్నామన్నారు. పరీక్ష కేంద్రాల్లోకి ఎవరూ సెల్‌ఫోన్లు తీసుకురావద్దని సూచించారు. పరీక్షలు ప్రశాంత వాతావరణంలో నిర్వహించాలని ఆయన సూచించారు. ఈ నెల 25 నుంచి మే 2 వరకు పరీక్షలు జరుగనున్నాయి. టెన్త్ పరీక్షలు రెండు సెషన్లలో ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు మొదటి సెషన్, మధ్యాహ్నం 2.30 గంటల నుంచి సాయంత్రం 5.30 గంటల వరకు రెండవ సెషన్‌లో జరుతాయి. అలాగే ఇంటర్ పరీక్షలు రెండు సెషన్లలో ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు, మధ్యాహ్నం 2.30 గంటల నుంచి సాయంత్రం 5.30 గంటల వరకు పరీక్షలు జరుగుతాయి.

ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఇలా..

టెన్త్ పరీక్షలకు హనుమకొండ జిల్లాలో 2 పరీక్షా కేంద్రాలు ఏర్పాటు చేయగా 292 మంది విద్యార్థులు పరీక్షలు రాయనున్నారు. వరంగల్‌లో 3 కేంద్రాల్లో 552 మంది, మహబూబాబాద్‌లో 3 కేంద్రాల్లో 577 మంది, జయశంకర్ భూపా లపల్లిలోని ఒకే కేంద్రంలో 208 మంది, ములుగులో 3 కేంద్రాల్లో 526, జనగామ జిల్లాలో ఏర్పాటు చేసిన 2 కేంద్రాల్లో 274 మంది విద్యార్థులు పరీక్షలు రాయనున్నారు. అలాగే ఇంటర్ పరీక్షలకు హనుమకొండ జిల్లాలో ఏర్పాటు చేసిన 4 కేంద్రాల్లో 936 మంది విద్యార్థులు హాజరు కానుండగా, వరంగల్‌లో 4 కేంద్రాల్లో 650 మంది, మహబూబాబాద్‌లో 3 కేంద్రాల్లో 727 మంది, జయశంకర్ భూపాలపల్లిలో 2 కేంద్రాల్లో 378 మంది, ములుగులో 3 కేంద్రాల్లో 602, జనగామ జిల్లాలో ఏర్పాటు చేసిన 3 కేంద్రాల్లో 608 మంది పరీక్షలకు హాజరు కానున్నారు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా టెన్త్‌కు 14 కేంద్రా లను ఏర్పాటు చేయగా 2,429 మంది, ఇంటర్‌కు 19 కేంద్రాలు ఏర్పాటు చేయగా 3,901 మంది పరీక్షలు రాయనున్నారు.

29 నుంచి శాతవాహన ఎక్స్‌ప్రెస్ రద్దు

కాజీపేట, ఏప్రిల్ 23: సికింద్రాబాద్ రైల్వే డివిజన్ పరిధిలో చేపడుతున్న రైల్వే ట్రాక్ నిర్మాణం, మరమ్మతుల దృష్ట్యా ఈ నెల 29 నుంచి పలు రైళ్లను రద్దు చేస్తున్నట్లు రైల్వే అధికారులు తెలిపారు. అందులో భాగంగా సికింద్రాబాద్ - విజయవాడ మధ్య ప్రయాణించే (12713, 14)శాతవాహన ఎక్స్‌ప్రెస్ అప్ అండ్ డౌన్ రైలును ఏప్రిల్ 29 నుంచి మే 10 వరకు, అలాగే మే 16 నుంచి 22 వరకు రద్దు చేశారు. (07757) వరంగల్ - సికింద్రాబాద్, సికింద్రాబాద్ - కాజీపేట జంక్షన్‌ల మధ్య నడిచే పుష్‌పుల్ రైళు మే 3, 4 తేదీలలో రద్దు చేస్తున్నామని, అనంతరం రైళ్లు యథావిధిగా నడుస్తాయని రైల్వే అధికారులు తెలిపారు.

బీఆర్‌ఎస్, బీజేపీలు చీకటి దోస్తులు

- వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు




మడికొండ జన జాతర సభా స్థలిలో విలేకరులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే నాగరాజు

మడికొండ, ఏప్రిల్ 23: బీఆర్‌ఎస్, బీజేపీలు చీకటి దోస్తులని, బీజేపీ అభ్యర్థి అరూరి రమేష్‌ను అసెంబ్లీ ఎన్నికల్లో ప్రజలు తిరస్కరించినా బుద్ధిరాలేదని, అలాగే బీఆర్‌ఎస్ అభ్యర్థి సచ్చిన పాములాంటివాడని, ఆయనకు ఓటు వేసే వారే లేరని వర్ధన్నపేట ఎమ్మెల్యే కె.ఆర్. నాగరాజు విమర్శించారు. బుధవారం మడికొండలో నిర్వహించనున్న కాంగ్రెస్ జన జాతర సభాస్థలిని మంగళవారం ఎమ్మెల్యే సందర్శించి ఏర్పాట్లను పరిశీలించారు. అనంతరం విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ.. భూ కబ్జాదారుడైన అరూరి రమేష్‌ను బీజేపీ వరంగల్ ఎంపీ అభ్యర్థిగా ప్రకటించడం సిగ్గుచేటన్నారు. మోసాలు, భూకబ్జాలు చేసిన అరూరి మాటలు ప్రజలు నమ్మవద్దని తెలిపారు. సబ్బండ వర్గాల ప్రజలకు సమ న్యాయం జరగాలంటే కాంగ్రెస్ అధికారంలోకి రావాలని స్పష్టం చేశారు. కాంగ్రెస్ అభ్యర్థి కడియం కావ్యను భారీ మెజారిటీతో గెలిపించాలని కోరారు. అలాగే స్థానిక ప్రజలకు ఇబ్బందిగా పరిణమించిన డంపింగ్ యార్డు సమస్య పరిష్కారానికి, జిల్లా స్టడీ సర్కిల్ ఏర్పాటు కోసం సీఎం రేవంత్ రెడ్డికి వినతిపత్రం అందజేస్తానని హామీ ఇచ్చారు.

ఈ సమావేశంలో వర్ధన్నపేట నియోజకవర్గ అధికార ప్రతినిధి నిమ్మాని శేఖర్‌రావు, మెట్టుగుట్ట చైర్మన్ పైడిపాల రఘుచందర్, కాజీపేట మండల అధ్యక్షుడు శ్రీనివాస్‌రెడ్డి, పార్టీ నాయకులు కుర్ల మోహన్, వస్కుల శంకర్, బ్లిల రవిందర్, గుర్రం అమర్‌నాథ్, గడుసు రాజు, వస్కుల నాగరాజు, వస్కుల శ్రీను, కడమంచి సాయిలు, కడమంచి మహేందర్, దండిగం సదానందం తదితరులు పాల్గొన్నారు.

కడియం కావ్యకే మాదిగల మద్దతు

వడ్డెపల్లి: లోక్‌సభ కాంగ్రెస్ అభ్యర్థి కడియం కావ్యకే మాదిగ హక్కుల దండోరా సంపూర్ణ మద్దతును ప్రకటిస్తున్నదని, మాదిగ సమాజం కడియం కావ్యను గెలిపించాలని మాదిగ హక్కుల దండోరా (ఎంహెచ్‌డీ) రాష్ట్ర అధ్యక్షుడు రేగుంట సునిల్ మాదిగ అన్నారు. మంగళవారం బాలసముద్రంలోని ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎస్సీ వర్గీకరణ ఉద్యమంలో స్టేషన్ ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి పాత్ర ఎనలేనిదని అన్నారు. ఎస్సీ ఉప కులాల నుంచి రాజకీయంగా ఎదిగిన కడియం శ్రీహరి మాదిగ ఉద్యమానికి ఎంతగానో సేవ చేశారని స్పష్టం చేశారు. 2014లో వర్ధన్నపేట నియోజకవర్గం నుంచి మహాజన సోషలిస్టు పార్టీ అభ్యర్థిగా బరిలో నిలిచిన మంద కృష్ణ మాదిగను ఓడించి మట్టికరిపించిన అరూరి రమేష్‌కు మంద కృష్ణ మద్దతు ప్రకటించడం చారిత్రక తప్పిదమని రేగుంట సునిల్ మాదిగ అన్నారు. బీజేపీ నాయకులు రాజ్యాంగాన్ని మారుస్తామని బహిటంగానే ప్రకటిస్తుంటే మంద కృష్ణ మాదిగ ఆ పార్టీకి వంత పాడడం ఎంత వరకు సమంజసమని ప్రశ్నించారు. ఎమ్మెల్యేగా గెలిచిన తర్వాత అరూరి రమేష్ మంద కృష్ణ మాదిగకు చెందిన భూమిని కబ్జా చేసిన ఘనుడని ఆరోపించారు. అలాంటి అరూరి రమేష్‌కు మంద కృష్ణ మాదిగ మద్దతు ప్రకటించడం విచారకరమని ఆయన పేర్కొన్నారు. మాదిగ సమాజానికి లోక్‌సభ టికెట్ కేటాయించలేదని భవిష్యత్‌లో రాజ్యసభ, ఎమ్మెల్సీ, నామినేట్ పదవులు కేటాయించి న్యాయం చేయాలని సీఎం రేవంత్‌రెడ్డిని కోరారు. సమావేశంలో జై భీమ్ యూత్ జిల్లా కన్వీనర్ తాళ్లపెల్లి విజయ్, ఎంహెచ్‌డీ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ ఎలుకటి జనార్ధన్ మాదిగ, జిల్లా అధ్యక్షుడు కవ్వంపల్లి రవి, రాష్ట్ర, జిల్లా నాయకులు ఎర్రోళ్ల సురేష్, మాట్ల రమేష్, పోశన్న, నరేందర్ తదితరులు పాల్గొన్నారు.



విశిష్ట తీర్పుల కోట

హనుమకొండ, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి): మహబూబాబాద్ లోక్‌సభ నియోజకవర్గం విశిష్టమైన నేపథ్యాన్ని కలిగి ఉన్నది. ఇక్కడి ఓటర్లు ప్రతీసారి విలక్షణమైన తీర్పు ఇస్తూ వచ్చారు. ఒకసారి మరోసారి తిరిగి ఆవిర్భవించిన మహబూబాబాద్ లోకసభ స్థానం మెదట జనరల్ స్థానంగా ఉండి ఆ తర్వాత ఎస్టీకి రిజర్వు అయింది. ఇటికాల మధుసూదన్ రావు, రామసహాయం సురేందర్‌రెడ్డి వంటి ప్రముఖ నేతలను పార్లమెంట్‌కు పంపిన ఘనమైన చరిత్ర కలిగిన నియోజకవర్గం ఇది. మరో దఫా ఎన్నికలకు సిద్ధమైంది. ఒకప్పుడు కాంగ్రెస్‌కు కంచుకోట అయిన మహబూబాబాద్ లోకసభ స్థానంలో 2019, 2024 మధ్య రాజకీయ పరిస్థితులు మారిపోయాయి. ప్రస్తుతం బీఆర్‌ఎస్ గుప్పిట్లో ఉన్న ఈ నియోజకవర్గంలో ఈ సారి ఎన్నికల్లో జనం బలంతో గెలిచి మానుకోటపై జెండా ఎగురవేసేది ఎవరు? ఈ లోకసభ ఎన్నికల్లో సీన్ ఎలా ఉండబోతోంది? అన్నది సర్వత్రా చర్చనీయంగా మారింది.

1957లో..

మహబూబాబాద్ లోక్‌సభ స్థానం 1957లో ఏర్పాటైంది. నియోజకవర్గాల పునర్విభజన ఫలితంగా 1967లో రద్దయింది. ఆ తర్వాత 2009లో తిరిగి ఆవిర్భవించింది. ఒకసారి రద్దయి తిరిగి ఏర్పాటైన చరిత్ర కలిగిన నియోజకవర్గం ఇదే. 1957, 1962 ఎన్నికల్లో కాంగ్రెస్ పక్షాన ఇటికాల మధుసూదన్‌రావు రెండుసార్లు ఈ నియోజకవర్గం నుంచి వరుసగా గెలుపొందారు. ఆ తర్వాత 1965లో జరిగిన ఉప ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థిగా ఆర్.సురేందర్‌రెడ్డి విజయం సాధించారు. ఆయన ఆ తర్వాత 1967, 1989, 1991 ఎన్నికల్లో మూడుసార్లు వరంగల్ లోకసభ నియోజకవర్గం నుంచి గెలిచి రికార్డు సృష్టించారు. 1967లో మహబూబాబాద్ నియోజకవర్గం రద్దయింది. ఈ నియోజకవర్గంలోని కొన్ని అసెంబ్లీ సెగ్మెంట్లను కలిపి భద్రాచలం (ఎస్‌టీ) నియోజకవర్గం ఏర్పాటైంది. ఈ స్థానంలో 11 సార్లు ఎన్నికలు జరిగాయి. ఖమ్మం జిల్లాతో పాటు పశ్చిమగోదావరి, తూర్పుగోదావరి జిల్లాలోని కొన్ని అసెంబ్లీ సెగ్మెంట్లతో కూడి తెలంగాణ, ఆంధ్రప్రాంతాలకు వారధిగా ఉన్న భద్రాచలం నియోజకవర్గం 2009లో రద్దయింది.

- ఒకసారి రద్దయి మళ్లీ ఆవిర్భావం
- నాడు జనరల్.. ఇప్పుడు ఎస్టీ రిజర్వుడు
- విశిష్ట తీర్పునిస్తున్న మహబూబాబాద్ లోక్‌సభ ప్రజలు
- ఇప్పుడు త్రిముఖ పోరులో గెలిచేదెవరో?
- బరిలో అంతా పాతముఖాలే..
- అందరూ ఎంపీలుగా చేసిన వారే..
- ఒకప్పుడు కాంగ్రెస్ కంచుకోట
- 2014 తర్వాత మారిన బలాబలాలు
- మహబూబాబాద్ లోక్‌సభ నియోజకవర్గ ముఖ చిత్రం

నియోజకవర్గం	పురుషులు	మహిళలు	ఇతరులు	మొత్తం	పోలింగ్ కేంద్రాలు
డోర్నకల్	1,09,150	1,13,455	07	2,22,612	264
మహబూబాబాద్	1,26,611	1,31,794	46	2,58,451	287
నర్సంపేట	1,15,068	1,20,370	09	2,35,447	283
ములుగు	1,13,592	1,19,172	27	1,32,791	307
పినపాక	99,824	1,03,798	05	2,03,627	250
ఇల్లందు	1,09,812	1,15,094	04	2,24,910	242
భద్రాచలం	72,925	7,83,280	07	1,52,529	180
మొత్తం	7,46,982	7,83,280	105	15,30,367	1,813

పునరావిర్భావం

నియోజకవర్గాల పునర్విభజన ఫలితంగా 2009లో మహబూబాబాద్ నియోజకవర్గం మళ్లీ ఆవిర్భవించింది. అయితే అంతకు ముందు జనరల్‌గా ఉన్న ఈ స్థానం ఎస్టీకి రిజర్వ్ అయింది. 2009 ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థి పోరిక బలరాంనాయక్ ఎన్నికయి తొలిసారి పార్లమెంట్‌లో అడుగుపెట్టారు. యూపీఏ సర్కార్‌లో కేంద్రమంత్రిగా పని చేశారు. 20014 ఎంపీ ఎన్నికలు వచ్చేసరికి మానుకోట బీఆర్‌ఎస్‌కు కంచుకోటగా మారింది. తొలిసారి మహబూబాబాద్‌లో గులాబీ జెండా ఎగిరింది. టీఆర్‌ఎస్ అభ్యర్థిగా బరిలో దిగిన సీతారాంనాయక్ కాంగ్రెస్ అభ్యర్థి బలరాంనాయక్‌పై విజయం సాధించారు. కాకతీయ విశ్వవిద్యాలయం ప్రొఫెసర్‌గా పనిచేసిన సీతారాం నాయక్.. తెలంగాణ ఉద్యమ సమయంలో చేసిన కృషిని గుర్తించి టీఆర్‌ఎస్ నుంచి మహబూబాబాద్ ఎంపీగా పోటీ చేసే అవకాశం కేసీఆర్ ఇచ్చారు. 2019 ఎన్నికల్లో సీనియర్ నేత డీఎస్ రెడ్యానాయక్ కూతురు మాలోతు కవిత టీఆర్‌ఎస్ అభ్యర్థిగా గెలిచి పార్లమెంట్‌లో మొదటిసారి అడుగుపెట్టారు. మొత్తంగా మానుకోట లోక్‌సభ నుంచి ఇప్పటి వరకు ముగ్గురు గిరిజనులు ఒక్కోసారి గెలవగా, ఒక రెడ్డి నేత, ఇతర సామాజికవర్గానికి చెందిన మరొకరు రెండు సార్లు ఎన్నికయ్యారు.

ఓట్ల వివరాలు

మహబూబాబాద్ లోక్‌సభ నియోజకవర్గంలో మొత్తం 15,30,367 మంది ఓటర్లు ఉన్నారు. ఈ నియోజకవర్గంలో పురుషుల కన్నా మహిళా ఓటర్లే ఎక్కువగా ఉన్నారు. 746,982 మంది పురుష ఓటర్లుండగా, 7,83,280 మంది మహిళా ఓటర్లు ఉన్నారు.



మారిన సమీకరణలు

2009 వరకు కాంగ్రెస్‌కు కంచుకోటగా ఉన్న మహబూబాబాద్ లోక్‌సభ నియోజకవర్గం.. 2014 ఎన్నికలు వచ్చేసరికి మారిన రాజకీయ సమీకరణాల ఫలితంగా టీఆర్‌ఎస్ వశమైంది. 2014, 2019 ఎన్నికల్లో వరుసగా రెండుసార్లు ఈ నియోజకవర్గంలో టీఆర్‌ఎస్ గులాబీ జెండాను ఎగురవేసింది. ఇటీవలి అసెంబ్లీ ఎన్నికల తర్వాత రాష్ట్రంలో చోటు చేసుకున్న సరికొత్త పరిణామాల ప్రభావం ఈ నియోజకవర్గంపై కూడా పడింది. అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ ఘన విజయం సాధించడంతో ఇక్కడ బీఆర్‌ఎస్ పునాదులు కదిలిపోయాయి. ఈ నియోజకవర్గ పరిధిలో ఏడు అసెంబ్లీ సెగ్మెంట్లు- డోర్నకల్, మహబూబాబాద్, నర్సంపేట, ములుగు, పినపాక, ఇల్లందు, భద్రాచలం ఉన్నాయి. ఆరు అసెంబ్లీ స్థానాల్లో కాంగ్రెస్ విజయం సాధించగా, ఒక్క భద్రాచలంలో బీఆర్‌ఎస్ గెలిచింది. అయితే ఇక్కడి నుంచి గెలిచిన తెల్లం వెంకట్రావు సైతం బీఆర్‌ఎస్‌ను వీడి కాంగ్రెస్ పార్టీకి దగ్గరయ్యారు. దీంతో మహబూబాబాద్ పరిధిలోని అన్ని అసెంబ్లీ స్థానాలు కాంగ్రెస్ గుప్పిట్లోకి వచ్చినట్లయింది. ములుగు నుంచి ఎమ్మెల్యేగా గెలిచిన సీతక్క.. ప్రస్తుతం రేవంత్‌రెడ్డి మంత్రివర్గంలో కేబినెట్ మంత్రిగా కొనసాగుతున్నారు.



మాలోతు కవిత (బీఆర్‌ఎస్) | సీతారాంనాయక్ (బీజేపీ) | పోరిక బలరాంనాయక్ (కాంగ్రెస్)

పాతముఖాలే..

గతంలో మానుకోట లోక్‌సభ స్థానం నుంచి గెలిచి బీఆర్‌ఎస్ నుంచి టికెట్ రాక భంగపడిన సీతారాంనాయక్ బీజేపీలో చేరి కాషాయం కండువా కప్పుకున్నాడు. ప్రస్తుతం ఆ పార్టీ నుంచి ఇక్కడ బరిలో దిగి మరోసారి అదృష్టం పరిక్షించుకోబోతున్నారు. గతంలో ఇక్కడ కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీ చేసి గెలిచిన పోరిక బలరాంనాయక్ ఇదే పార్టీ నుంచి తిరిగి పోటీ చేస్తున్నారు. సిట్టింగ్ ఎంపీ మాలోతు కవిత బీఆర్‌ఎస్ నుంచి తిరిగి పోటీ చేస్తున్నారు. నియోజకవర్గంలో నెలకొన్న ఈ త్రిముఖ పోటీలో ఈసారి ఏ పార్టీ విజయపతాకం రెపరెపలాడుతోందోనన్న ఉత్కంఠ నెలకొన్నది. మహబూబాబాద్ లోక్‌సభ స్థానం ఈ సారి కూడా తనదేనన్న విశ్వాసాన్ని బీఆర్‌ఎస్ వ్యక్తం చేస్తోంది. అసెంబ్లీ ఎన్నికల్లో విజయంతో మంచి ఊపుమీద ఉన్న కాంగ్రెస్ ఈ ఎన్నికల్లో మానుకోటలో సత్తాచాటుతామన్న ధీమాతో ఉన్నది. మోదీపై ఉన్న ఆకర్శణ, బీఆర్‌ఎస్ నుంచి క్రాస్ ఓటింగ్‌పై ఆశలుపెట్టుకున్న బీజేపీ కూడా గెలవగనన్న నమ్మకంతో ఉన్నది.

ప్రశాంతంగా లోక్‌సభ నామినేషన్ల పర్వం

ఐదోరోజు వరంగల్‌లో 9, మానుకోటలో 8 నామినేషన్లు

- నామినేషన్ వేసిన మహబూబాబాద్ బీఆర్‌ఎస్ అభ్యర్థి కవిత
- రేపటితో పూర్తి కానున్న దాఖలు గడువు



మహబూబాబాద్‌లో రిటర్నింగ్ అధికారి అద్వైత్‌కుమార్‌సింగ్‌కు నామినేషన్ పత్రాలు అందజేస్తున్న బీఆర్‌ఎస్ అభ్యర్థి, ఎంపీ కవిత





వరంగల్ పార్లమెంట్ రిటర్నింగ్ అధికారి, కలెక్టర్ ప్రావీణ్యకు నామినేషన్ పత్రాలు సమర్పిస్తున్న స్వతంత్ర అభ్యర్థి చిలుముల్ల సుజాత, విడుతలై చిరుతైగల్ కచ్చిపార్టీ అభ్యర్థి మచ్చ దేవేందర్

వరంగల్ కలెక్టరేట్/మహబూబాబాద్‌టౌన్, ఏప్రిల్ 23: పార్లమెంట్ ఎన్నికల నామినేషన్ల పర్వం ప్రశాంతంగా జరుగుతోంది. ఐదోరోజైన మంగళవారం వరంగల్ పార్లమెంట్ స్థానానికి 9, మహబూబాబాద్ (మానుకోట) నియోజకవర్గానికి ఎనిమిది నామినేషన్లు దాఖలయ్యాయి. వరంగల్ కలెక్టరేట్‌లో రిటర్నింగ్ అధికారి, కలెక్టర్ ప్రావీణ్య అభ్యర్థుల నుంచి నామినేషన్ పత్రాలను స్వీకరించారు. విడుతలై చిరుతైగల్ కచ్చి పార్టీ నుంచి మచ్చ దేవేందర్ రెండు సెట్లు, స్వతంత్ర అభ్యర్థులుగా చిలుముల్ల సుజాత, పోగుల అశోక్, పోతరాజు నర్సింహరాజు, కుమ్మరి కన్నయ్య, కొంగర అనిల్ కుమార్, ఇల్లందుల శోభన్ బాబు నామినేషన్ పత్రాలను సమర్పించారు.

అలాగే మహబూబాబాద్ పార్లమెంట్ నియోజకవర్గానికి బీఆర్‌ఎస్ అభ్యర్థిగా సిట్టింగ్ ఎంపీ మాలోతు కవిత రెండు సెట్లు, ఆధార్ పార్టీ నుంచి జాటోతు రఘు వర్మ, ఆదివాసీ జేఏసీ నుంచి చందా లింగయ్య, సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ నుంచి మోకాళ్ల మురళీ కృష్ణ, స్వతంత్ర అభ్యర్థులుగా బానోత్ ప్రేమ్‌లాల్, పోరిక శ్యామలనాయక్, పడిగే ఎర్రయ్య నామినేషన్లు దాఖలు చేశారు. వారి నుంచి మహబూబాబాద్ రిటర్నింగ్ అధికారి, కలెక్టర్ అద్వైత్‌కుమార్‌సింగ్ నామినేషన్ పత్రాలు స్వీకరించారు.

కాగా ఇప్పటి వరకు వరంగల్ పార్లమెంట్ స్థానంలో ఐదు రోజుల్లో మొత్తం 26 అభ్యర్థులు 31సెట్లు, మహబూబాబాద్ లో 13 మంది అభ్యర్థులు 19సెట్లు వేశారు. కాగా నామినేషన్ల ప్రక్రియ గురువారంతో పూర్తి కానుండడంతో నామినేషన్ల దాఖలు ప్రక్రియ మరింత ఊపందుకునే అవకాశం కనిపిస్తోంది.

నామినేషన్ కౌంటర్

ఐదో రోజు (23-4-2024)

దాఖలైన మొత్తం నామినేషన్లు	
వరంగల్	మహ-బాద్
31	19

వరంగల్ (ఎస్సీ) : మచ్చ దేవేందర్-రెండు సెట్లు(వీసీకే పార్టీ), చిలుముల్ల సుజాత, పోగుల అశోక్, పోతరాజు నర్సింహరాజు, కుమ్మరి కన్నయ్య, కొంగర అనిల్‌కుమార్, ఇల్లందుల శోభన్‌బాబు- 2 సెట్లు (స్వతంత్ర)

మహబూబాబాద్(ఎస్టీ) : మాలోతు కవిత-2 సెట్లు(బీఆర్‌ఎస్), జాటోతు రఘువర్మ (ఆధార్‌పార్టీ), చందా లింగయ్య (ఆదివాసీ జేఏసీ), మోకాళ్ల మురళీకృష్ణ (సీపీఐఎంఎల్ న్యూ), పోరిక శ్యామల నాయక్, పడిగే ఎర్రయ్య బానోత్ ప్రేమ్‌లాల్ (స్వతంత్ర).



మోసపూరిత హామీలతో
రేవంత్ గద్దెనెక్కారు

- ఈ ఎన్నికల్లో ఆయనకు బుద్ధి చెప్పాలి
- వరంగల్ తూర్పు, వర్ధన్నపేట సమావేశాల్లో కేటీఆర్



సభకు హాజరైన ప్రజలు, అభివాదం చేస్తున్న కేటీఆర్



మట్టెవాడ / రాంనగర్, ఏప్రిల్ 23 : మోస పూరితమైన హామీలిచ్చి రేవంత్‌రెడ్డి గద్దెనెక్కాడని, మరోసారి తెలంగాణ ప్రజలు మోసపోకుండా ఆలోచించి ఓటు వేయాలని బీఆర్‌ఎస్ కార్యనిర్వాహక అధ్యక్షుడు, మాజీ మంత్రి కల్వకుంట్ల తారకరామారావు పేర్కొన్నారు. మంగళవారం సాయంత్రం వరంగల్ తూర్పు మాజీ ఎమ్మెల్యే నన్నపునేని నరేందర్ అధ్యక్షతన వరంగల్ ఉర్సుగుట్ట రోడ్డులోని నాని గార్డెన్‌లో తూర్పు నియోజకవర్గ విస్తృత స్థాయి సమావేశం, హంటర్‌రోడ్డులోని డీ కన్వెన్షన్ హాల్‌లో వర్ధన్నపేట నియోజకవర్గ స్థాయి కార్యకర్తల సమావేశానికి ఆయన హాజరయ్యారు. ఈ సమావేశాలకు బీఆర్‌ఎస్ వరంగల్ పార్లమెంట్ అభ్యర్థి డాక్టర్ సుధీర్‌కుమార్, శాసన మండలి డిప్యూటీ చైర్మన్ డాక్టర్ బండా ప్రకాష్, మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు, ఎమ్మెల్సీలు పోచంపల్లి శ్రీనివాస్‌రెడ్డి, బస్వరాజు సారయ్య, మాజీ డిప్యూటీ సీఎం తాటికొండ రాజయ్య, మాజీ ప్రభుత్వ చీఫ్ విప్ దాస్యం వినయ్ భాస్కర్, డిప్యూటీ మేయర్ రిజ్వానా షమీ మసూద్, వరంగల్ జడ్పీ చైర్మన్ గండ్ర జ్యోతి, మాజీ కుడా చైర్మన్ సుందర్‌రాజ్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు. ఈ సమావేశాల్లో కేటీఆర్ మాట్లాడుతూ నాలుగు నెలల కింద జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో 1.85శాతం ఓట్ల తేడాతో బీఆర్‌ఎస్ ఓడిపోయిందని 14సీట్లలో తక్కువ ఓట్లతో ఓటమిపాలయ్యామన్నారు. అసెంబ్లీ ఎన్నికలకు ముందు అభయ హస్తం చూపిన రేవంత్ ఇప్పుడు భస్మాసుర హస్తాన్ని చూపుతున్నారని, రైతు రుణమాఫీ, ఆడపిల్లలకు వివాహ కానుకగా తులం బంగారం, ఆసరా పింఛన్ల పెంపుదల చేయలేదని, కాంగ్రెస్ వచ్చిన తర్వాత నీటి, కరెంటు కష్టాలు ఎక్కువయ్యాయన్నారు. అసెంబ్లీ ఎన్నికలప్పుడు మోసం పార్ట్ 1 చేసిన ఆయన ఇప్పుడు మోసం పార్ట్ -2 చేస్తున్నారని, తాను హై టెన్షన్ వైర్‌నని తనను ముట్టుకుంటే మాడి మసైపోతారని అంటున్నాడని, అసలు కాంగ్రెస్‌లో కరెంటే లేదని ఎలా మసై పోతారని ప్రశ్నించారు. రైతులకు రుణమాఫీ అమలు చేయకుండా దేవుళ్లపై ఒట్టేసి ఆగస్టు నాటికి చేస్తానని చెబితే ప్రజలు నమ్మే పరిస్థితిలో లేరన్నారు. 100 రోజుల్లో అమలు చేస్తానన్న ఆరు గ్యారంటీలు ఏమయ్యాయని, కాంగ్రెస్ ఇచ్చిన హామీలతో ఎవరూ లబ్ధిపొందడం లేదని, రుణమాఫీ చేయకపోవడంతో రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. కడియం శ్రీహరి నయ వంచకుడు, విశ్వాస ఘాతకుడని, అరూరి రమేష్ కూడా అలాంటి వ్యక్తేనని 2013లో పార్టీలో చేరిన కడియం శ్రీహరికి కేసీఆర్ ఎంపీగా అవకాశమిచ్చారని, మళ్లీ ఏడాదిలోపే డిప్యూటీ సీఎంగా కూడా చేశారని, ఎమ్మెల్సీగా, 2023లో స్టేషన్ ఘన్‌పూర్ ఎమ్మెల్యేగా అవకాశం కల్పించారని, పదేళ్లలో మూడు చట్ట సభలకు శ్రీహరికి కేసీఆర్ అవకాశం కల్పించారన్నారు. అలాగే ఈ పార్లమెంటు ఎన్నికల్లోనూ వరంగల్ టికెట్‌ను ఆయన కుమార్తె డాక్టర్ కావ్యకు ఇచ్చామని కానీ కొన్ని రోజుల్లోనే పార్టీకి రాజీనామా చేసి అభివృద్ధి కోసం కాంగ్రెస్‌లో చేరుతున్నామని చెప్పి నమ్మించి గొంతుకోశారని తీవ్ర వ్యాఖ్యలు చేశారు. అరూరి రమేష్‌కు రెండు పర్యాయాలు ఎమ్మెల్యేగా అవకాశం ఇచ్చామని, లోక్‌సభ ఎన్నికల్లో కావ్య, అరూరి రమేష్‌కు వరంగల్ ఓటర్లు బుద్ధి చెప్పాలని, ఉద్యమకారుడైన డాక్టర్ సుధీర్‌కుమార్‌ను భారీ మెజార్టీతో గెలిపించాలని పిలుపునిచ్చారు. మోదీ పాలనలో నిత్యావసరాల ధరలు పెరిగాయని, శ్రీరాముడిని అడ్డుపెట్టుకొని బీజేపీ రాజకీయం చేస్తోందని, మామునూరు ఎయిర్‌పోర్టు, మెగా టెక్స్‌టైల్ పార్కుకు నిధులు, కోచ్ ఫ్యాక్టరీ నిర్మాణం చేయకుండా వరంగల్ ప్రజలను మోసం చేసిందన్నారు. అలాంటి మోదీని రాహుల్ గాంధీ విమర్శిస్తుంటే ఇక్కడ రేవంత్‌రెడ్డి బడే భాయ్ అంటూ మోదీని పొగుడుతున్నాడని, కాంగ్రెస్ పార్టీ విధానమేంటో అర్థం కావడం లేదన్నారు. ప్రజలను మోసగిస్తున్న బీజేపీ, కాంగ్రెస్‌లను ఓటుతో తొక్కేయాలన్నారు. లోక్‌సభ ఎన్నికల్లో బీఆర్‌ఎస్ 10కి పైగా పార్లమెంట్‌సీట్లు గెలిస్తే కేసీఆర్ రాజకీయాలను శాసిస్తాడని కేటీఆర్ పేర్కొన్నారు.



సభలో మాట్లాడుతున్న కేటీఆర్, పక్కన వరంగల్ అభ్యర్థి సుధీర్‌కుమార్

శ్రీహరి అవినీతి తిమింగళం.. కావ్య డమ్మీ..

మాజీ ఉప ముఖ్యమంత్రి తాటికొండ రాజయ్య..

నమ్మకద్రోహి, అవినీతి తిమింగళం కడియం శ్రీహరి అని మాజీ ఉప ముఖ్యమంత్రి తాటికొండ రాజయ్య ఘాటు విమర్శలు చేశారు. తాను 1994లో టీడీపీ టికెట్‌ను నిరాకరిస్తే కడియం శ్రీహరి ఆ టికెట్ తీసుకొని గెలిచారన్నారు. ఆరు నెలల్లో కాంగ్రెస్ ప్రభుత్వం కూలి పోతుందని చెప్పిన ఆయన ఇప్పుడు అబివృద్ధి కోసమంటూ కాంగ్రెస్‌లో చేరి రోజుకో మాట మాట్లాడుతున్నారని ప్రజలు ఈ విషయాన్ని గమనిస్తున్నారన్నారు. శ్రీహరి బ్లాక్ మెయిలింగ్ చేస్తూ అన్ని పదవులను అనుభవించారని, దళితులను అణగదొక్కి పదవులు పొందారన్నారు. కడియం కులం పై ఇప్పటి వరకు స్పష్టత లేదని ఆరోపించారు.

బీఆర్‌ఎస్ హయాంలోనే వరంగల్ తూర్పు అభివృద్ధి : మాజీ ఎమ్మెల్యే నన్నపునేని నరేందర్

బీఆర్‌ఎస్ హయాంలోనే వరంగల్ తూర్పులో రూ.4వేలకోట్లతో అభివృద్ధి జరిగిందన్నారు. వరంగల్ బస్టాండ్, సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రి, కలెక్టరేట్ భవన నిర్మాణాలు జరుగుతున్నాయన్నారు. ప్రస్తుత తూర్పు ఎమ్మెల్యే మంత్రి కొండా సురేఖ గెలిచి ఐదు నెలలు కావస్తున్నా ఈ ప్రాంత ప్రజలను కలవడం లేదని వారి సమస్యలు విన్న దాఖలాలు లేవని విమర్శించారు. ఈ సమావేశంలో కార్పొరేటర్లు పల్లం రవి పద్మ, బోగి సురేష్‌సువర్ణ, దిడ్డి కుమారస్వామి, బస్వరాజు శిరీష, మరుపల్లి రవి, గందె కల్పనవీన్, సిద్ధం రాజు, బీఆర్‌ఎస్ నాయకులు కంచె సంపత్, సయ్యద్ మసూద్, తునికి రమేష్‌బాబు, డాక్టర్ హరి రమాదేవి, దాచెపల్లి సీతారాం, బయ్యా స్వామి, బొల్లం సంపత్, కొమ్మిని సురేష్, నీలం రాజ్ కిశోర్, గోరంట్ల మనోహర్, ఎలుగం శ్రీనివాస్, కుందారపు రాజేందర్, పెద్ద సంఖ్యలో బీఆర్‌ఎస్ కార్యకర్తలు పాల్గొన్నారు.

బీజేపీ హయాంలోనే ఓబీసీల అభివృద్ధి

బీజేపీ ఓబీసీ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు ఆనంద్ గౌడ్



సమావేశంలో మాట్లాడుతున్న ఆనంద్ గౌడ్

హనుమకొండ టౌన్, ఏప్రిల్ 23: దేశంలో సామాజిక, ఆర్థిక అసమానతలను రూపుమాపడమే లక్ష్యంగా ప్రధాని మోదీ నాయకత్వంలోని కేంద్ర ప్రభుత్వం ముందుకు సాగుతోందని, ఓబీసీ వర్గాలకు వెన్నుదన్నుగా నిలిచి తోడ్పాటునందిస్తున్నారని బీజేపీ ఓబీసీ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు ఆనంద్ గౌడ్ అన్నారు. మంగళవారం హనుమకొండ హంటర్‌రోడ్‌లోని వేద బంక్వెట్ హాలులో బీజేపీ జిల్లా ఓబీసీ మోర్చా అధ్యక్షుడు బెజ్జంకి పూర్ణాచారి ఆధ్వర్యంలో వరంగల్ లోక్‌సభ నియోజకవర్గస్థాయి ఓబీసీ సమ్మేళనం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఆనంద్ గౌడ్ మాట్లాడుతూ.. ప్రతిపక్ష పార్టీల్లో ప్రధాని మోదీకి ప్రత్యామ్నాయ నాయకుడు లేరని అన్నారు. ఒక్కరోజు కూడా సెలవు తీసుకోకుండా ప్రజా సంక్షేమమే ధ్యేయంగా మోదీ పనిచేస్తున్నారని కీర్తించారు. మరోసారి మోదీని ప్రధానిని చేయాలని పిలుపునిచ్చారు. కరోనాకాలంలో దేశ ప్రజల ప్రాణాలను కాపాడిన ప్రధాని మోదీ.. ఏ ఒక్కరూ ఆకలితో ఉండకూడదని ప్రారంభించిన ఉచిత బియ్యం పంపిణీని ఇప్పటికీ కొనసాగిస్తున్నారన్నారు. భారత్ ఎన్నో విజయాలు సాధించడంలో ప్రధాని మోదీ కీలక పాత్ర పోషిస్తున్నారన్నారు. మోదీ పాలనలో స్వచ్ఛమైన పాలన అందుతోందన్నారు. దేశం మోదీ చేతిలో ఉంటేనే భద్రంగా ఉంటుందన్నారు. బీఆర్‌ఎస్ పాలనలో ప్రజలను దోచుకోవడంతోనే కేసీఆర్ గడిపారన్నారు. కేసీఆర్ ప్రజాపాలన మరిచి ఫామ్‌హౌస్ పాలనకే పరిమితమయ్యారన్నారు. ఇక కాంగ్రెస్ ఆరు గ్యారంటీలతో తెలంగాణ ప్రజలను మోసం చేసిందన్నారు. ఇచ్చిన హామీలను నెరవేర్చడంలో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలమైందన్నారు. బీఆర్‌ఎస్, కాంగ్రెస్‌కు ఓటేస్తే వృథా అని, రెండు పార్టీలు ఒకటేనన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా బీజేపీ అధ్యక్షురాలు రావు పద్మ, వరంగల్ అధ్యక్షుడు గంట రవికుమార్, వరంగల్ పార్లమెంట్ ప్రభారి డాక్టర్ వి.మురళీధర్ గౌడ్, ఓబీసీ మోర్చా పార్లమెంట్ ఇన్‌చార్జి వినయ్, ఉపాధ్యక్షులు సంజయ్ గనాటే తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి స్కూళ్లకు వేసవి సెలవులు


లింగ్యతండా (కురవి) ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు ప్రోగ్రెస్ కార్డులను అందజేస్తున్న హెచ్ఎం, ఉపాధ్యాయులు

మహబూబాబాద్ ఎడ్యుకేషన్, ఏప్రిల్ 23 : జిల్లా వ్యాప్తంగా బుధవారం నుంచి పాఠశాలలకు వేసవి సెలవులు ప్రారంభం కానున్నాయి. అన్ని యాజమాన్య పాఠశాలలు 1180 ఉండగా, వాటిల్లో 1వ తరగతి నుంచి 9 వరకు 91 వేలకుపైగా విద్యార్థులు విద్యనభ్యసిస్తున్నారు. కాగా, ఈనెల 15నుంచి 22 వర కు సమ్మెటివ్-2 పరీక్షలు నిర్వహించారు. ఏ రోజు పరీక్ష పేపర్లను ఆరోజే మూల్యాంకనం చేసిన ఉపాధ్యాయులు విద్యాసంవత్సరం మంగళవారం ప్రధానోపాధ్యాయులు విద్యార్థుల తల్లిదండ్రులతో సమావేశాలు నిర్వహించి వారి సమక్షంలో విద్యార్థుల ప్రోగ్రెస్ (మార్కుల) రిపోర్టులను అందజేశారు. ఈనెల 24 నుంచి జూన్ 11 వరకు వేసవి సెలవులు ఉండగా, అదేనెల 12 పాఠశాలలు పునఃప్రారంభం కానున్నాయి.

బస్సులో సీట్ల కోసం ఘర్షణ

తొర్రూరు, ఏప్రిల్23 : ఆర్టీసీ బస్సులో సీట్లకోసం ప్రయాణీకులు ఒకరిపై ఒకరు దాడి చేసుకున్న ఘటన మంగళవారం తొర్రూరులో చోటు చేసుకుంది. ప్రయాణీకులు చెప్పులతో కొట్టుకున్న వీడియోలు సోషల్ మీడియాలో వైరల్ అయ్యాయి. స్థానికుల కథనం ప్రకారం. తొర్రూరు బస్టాండ్ నుంచి రోజూ హైదరాబాద్‌లోని జగద్గిరిగుట్టకు 35 బస్సు సర్వీసులు వెళ్తుండగా, ప్రయాణీకుల రద్దీ తీవ్రంగా ఉంటోంది. బస్టాండ్‌లోకి వచ్చే బస్సులు సరైన సమయానికి రాక, వచ్చినబస్సులు పక్కన చెట్లకింద నిలిపి ఒకేసారి పాయింట్ మీదికి వెళ్లడతో ప్రయాణీకులు గుంపులుగా బస్సుఎక్కే ప్రయత్నం చేస్తున్నారు. సీట్లు ఆపుకునే క్రమంలో ఒకరిపైఒకరు చెప్పులతో దాడి చేసుకున్నారు. ఈ ఘటనతో బస్సులోని ప్రయాణీకులు భయభ్రాంతులకు గురయ్యారు. దీనిపై ఆర్టీసీ అధికారులను వివరణ కోరగా.. హైదరాబాద్ వెళ్లే బస్సులు హనుమకొండ నుంచి తొర్రూరుకు వచ్చి హైదరాబాద్‌కు వెళ్లే క్రమంలో సిబ్బంది భోజనాలు చేసి బస్సులను పాయింట్‌లపై వేస్తుండటంతో ఆలస్యం అవుతుందని తెలిపారు.

'సాధారణ ప్రసవాలు జరిగేలా చూడాలి'

మహబూబాబాద్ రూరల్, ఏప్రిల్ 23 : గర్భిణుల నమోదును 12 వారాలు చేయాలని, సాధారణ ప్రసవాలను ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో జరిగే విధంగా చర్యలు తీసుకోవాలని డిప్యూటీ డీఎంఅండ్‌హెచ్‌వో అంబరీష సూచించారు. మహబూబాబాద్ మండలం పర్వతగిరి, జంగిలిగొండ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలను మంగళవారం ఆయన ఆకస్మీకంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయా రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ అసంక్రమిత వ్యాధులైన బీపీ, షుగర్, క్యాన్సర్ పరీక్షలను 30 ఏళ్లు పైబడిన వారందరికి చేయాలన్నారు. వ్యాధి నిరోధక టీకాలు వందశాతం పూర్తయ్యే విధంగా చూడాలన్నారు. కీటక జనీత వ్యాధులైన మలేరియా, డెంగీ, ఫైలేరియా, చికున్‌గున్యా వ్యాధులను అరికట్టేందుకు ఫ్రైడేను డ్రైడేగా నిర్వహించాలన్నారు. కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ కృష్ణార్జున్‌రావు, సబ్ యూనిట్ అధికారి వడ్డెబోయిన శ్రీనివాస్, కిశోర్, లక్ష్మి, పూజా, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

అరూరి గెలుపును కాంక్షిస్తూ ప్రత్యేక పూజలు

తొర్రూరు, ఏప్రిల్ 23 : వరంగల్ బీజేపీ పార్లమెంట్ అభ్యర్థి అరూరి రమేశ్ గెలుపును కాంక్షిస్తూ మంగళవారం చిన్న హనుమాన్ జయంతి సందర్భంగా డివిజన్‌కేంద్రంలో బీజేపీ నాయకులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈసందర్భంగా నియోజకవర్గ కన్వీనర్ పూసల శ్రీమాన్ మాట్లాడారు. వరంగల్ సమగ్రఅభివృద్ధే బీజేపీ లక్ష్యం అని, మోదీ దేశంలో చేస్తున్న అభివృద్ధి పనులతో అరూరి రమేశ్ గెలుపు ఖాయమన్నారు. వరంగల్ పార్లమెంట్ అభ్యర్థి కోసం అత్యధిక నిధులు మంజూరు చేయించి అభివృద్ధికి కృషి చేస్తారని తెలిపారు. దేశంలో బీజేపీ హవా కొనసాగుతుందని, మరోసారి మోదీ ప్రధాని కావడం ఖాయం అన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు పల్లె కుమార్, శేఖర్, భరత్, సత్యనారాయణ, రాజ్‌కుమార్, నవీన్, రవి, రాజు, విజయ్, శివ, తదితరులు పాల్గొన్నారు.

బీజేపీతోనే దేశాభివృద్ధి సాధ్యం

● నెల్లికుదురు : బీజేపీతోనే దేశ అభివృద్ధి సాధ్యమని బీజేపీ అభ్యర్థి ఆజ్మీర సీతారాంనాయక్ కుమారుడు డాక్టర్ అజ్మీరా రాకేష్ తెలిపారు. బీజేపీని గెలిపించాలని కోరుతూ రత్తిరాంతండాలో ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్రప్రభుత్వ నిధులతోనే గ్రామాలు, తండాలు అభివృదిక్ష చెందుతున్నాయన్నారు. బీజేపీ అభ్యర్థి అజ్మీర సీతారాంనాయక్ గతంలో తండాలను గ్రామాలను అభివృద్ధి చేశాడని అధిక మెజారిటీతో గెలిపించాలన్నారు.

ఎంపీటీసీ గుగులోత్ మదన్‌లాల్, ఆజ్మీరా ప్రియాంక, అభి, బోగ అనిల్, సోమన్న, మనోజ్, భూక్య నవీన్ పాల్గొన్నారు.

బీజేపీలో పలువురి చేరిక


బీజేపీలో చేరుతున్న నాయకులకు కండువా కప్పి ఆహ్వానిస్తున్న జిల్లా అధ్యక్షుడు వెంకటేశ్వర్‌రావు

● బయ్యారం : మండల కేంద్రంలో బీఆర్ఎస్ సీనియర్ నాయకులు నాయిని శ్రీను, టీడీపీ మండల మాజీ అధ్యక్షుడు కరియాల చంద్రయ్య, ములక లక్ష్మయ్య బీజేపీ జిల్లా అధ్యక్షుడు యలమంచిలి వెంకటేశ్వర్‌రావు సమక్షంలో ఆ పార్టీలో చేరారు. మండల పార్టీ అధ్యక్షుడు రాసాల నరేష్‌యాదవ్ ఆధ్వర్యంలో జిల్లా అధ్యక్షుడు పార్టీ కండువాలను కప్పి వారిని ఆహ్వానించారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షుడు మాట్లాడుతూ ఎంపీ అభ్యర్థి సీతారాంనాయక్ గెలుపుకోసం ప్రతీ కార్యకర్త, నాయకుడు కృషి చేయాలని పిలుపునిచ్చారు.

ఘనంగా వేంకటేశ్వరస్వామి కల్యాణం

● భారీగా తరలి వచ్చిన భక్తులు
● హాజరైన డోర్నకల్ ఎమ్మెల్యే దంపతులు


మాకుల వేంకటేశ్వరస్వామి కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

మరిపెడ, ఏప్రిల్23 : మరిపెడ మాకుల వేంకటేశ్వరస్వామి కల్యాణోత్సవ వేడుకలను వేదపండితులు మంగళవారం రాత్రి అంగరంగ వైభవంగా నిర్వహించారు. స్వాములోరి కల్యాణం సందర్భంగా స్థానికుడైన మాజీ ఎంపీ ఆర్.సురేందర్‌రెడ్డి-జయమాల దంపతులు దేవతామూర్తులకు పట్టువస్త్రాలను సమర్పించారు. కల్యాణం సందర్భంగా ప్రభుత్వవిప్, డోర్నకల్ ఎమ్మెల్యే జాటోత్ రాంచంద్రునాయక్-ప్రమీల దంపతులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. వేంకటేశ్వరుడి కల్యాణానికి భక్తులు పెద్దఎత్తున తరలివచ్చారు. యాజ్ఞీకస్వామి ఎన్.సీ హెచ్ రాఘవాచార్యులు, వేదపండితులు వెలగలేటి సంపత్ కుమారాచార్యుల ఆధ్వర్యంలో వేదపండితులు శాస్త్రోయుక్తంగా మంత్రోచ్చరణలు జరిపి భాజాభజంత్రీల నడుమ అలివేలు మంగా-పద్మావతి-గోదా సమేత మాకుల వేంకటేశ్వరస్వామి కల్యాణోత్సవ ఘట్టాన్ని రాత్రి వైభవంగా నిర్వహించారు. ఆలయం నుంచి ఉత్సవ విగ్రహాలను అశ్వవాహనంపై కల్యాణ వేదిక వరకు ఊరేగించి ప్రత్యేక పూజల అనంతరం స్వామివారి వివాహోత్సవ వేడుకలను కమణీయంగా, కనులపండువగా నిర్వహించారు.అర్చకులు మంగళసూత్రాలను భక్తులకు చూపి అలివేలు మంగా-పద్మావతి-గోదా సమేత వేంకటేశ్వరస్వామి ఉత్సవ విగ్రహాలకు మాంగల్యధారణ చేశారు. పలువురు భక్తులు తలంబ్రాల బియ్యం, పట్టువస్త్రాలను అందచేసి మొక్కులు చెల్లించుకున్నారు.

ఈ కార్యక్రమంలో జిల్లా ఎండోమెంట్ ఇన్‌స్పెక్టర్ కవిత, మునిసిపల్ చైర్‌పర్సన్ గుగులోత్ సింధూరకుమారిరవినాయక్, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు పెండ్లి రఘువీర్‌రెడ్డి, మాజీ సర్పంచ్ పానుగోత్ రాంలాల్, ఆలయ అనువంశిక చైర్మన్ ఎన్‌సీహెచ్ రామానుజాచార్యులు, ఆలయ ఈవో కలకోటి వేణుగోపాల్, భిక్షమాచారి, ధర్మకర్త గంట్లా రంగారెడ్డి, మరిపెడ పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు తాజుద్దీన్, అప్సర్, అమ్మునాయక్, లాయర్ లాలునాయక్, అర్చకులు, ఆలయ సిబ్బంది, భక్తులు పెద్దఎత్తున పాల్గొన్నారు.

ప్రభుత్వ స్కూల్లో గ్రాడ్యుయేషన్ డే

కేసముద్రం, ఏప్రిల్ 23 : కార్పొరేట్ స్కూళ్ల మాదిరిగా కేసముద్రం మండలం పెనుగొండ శివారు నర్సింహుల గూడెం ప్రాథమిక పాఠశాలలో మంగళవారం గ్రాడ్యుయేషన్ డేను నిర్వహించారు. ఈ సందర్భంగా డిగ్రీ పట్టాలు ఇచ్చినట్లుగా తల్లిదండ్రుల సమక్షంలో విద్యార్థులకు ప్రగతి పత్రాలను హెచ్ఎం కొడిపాక రమేష్ అందజేశారు. హాజరుశాతం అధికంగా ఉన్న విద్యార్థులకు పుస్తకాలను బహుకరించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయుడు పెరుమాండ్ల ప్రభాకర్, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

'ఉపాధి చట్టానికి తూట్లు పొడిచిన బీజేపీని ఓడించాలి'

మహబూబాబాద్ రూరల్, ఏప్రిల్ 23 : గ్రామీణ పేదల ఉపాధి కల్పన కోసం కమ్యూనిస్టులు, కాంగ్రెస్ కలిసి తీసుకు వచ్చిన ఉపాధి హామీ చట్టానికి తూట్లు పొడిచిన బీజేపీని ఓడించాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా నాయకుడు కుర్ర మహేష్ కోరారు. రెడ్యాలలో ఉపాధిహామీ కూలీల సమస్యలపై మాట్లాడారు. గతంలోఉపాధి కూలీలకు సమ్మర్ అలవెన్సులు ఇచ్చేదని, బీజేపీ ప్రభుత్వం వాటిని రద్దు చేసిందన్నారు. కూలీలకు పనిచేసే చోటటెంట్, తాగునీటి సౌకర్యం కల్పించడం లేదని మండిపడ్డారు.

ఈ సమావేశంలో సత్యనారాయణ, ప్రశాంత్, గణేష్, దేవేందర్, అరుణ, రాజు, వెంకటరెడ్డి, మల్లయ్య, వినోద్, రమ, యాకయ్య పాల్గొన్నారు.

12 గంటల పనిని రద్దు చేయాలి : ఇఫ్టూ


కరపత్రాలను ఆవిష్కరిస్తున్న ఇఫ్టూ జిల్లా అధ్యక్షుడు రవి

మహబూబాబాద్ రూరల్, ఏప్రిల్ 23 : గత 138 సంవత్సరాల క్రితం అమెరికా దేశంలో చికాగో పట్టణంలో ఐదుగురు కార్మికుల ప్రాణత్యాగంతో సాధించుకున్న 8 గంటల పనిని 12 గంటల పనిగా మార్చిన దేశ ప్రధాని మోదీ ఫాసిస్టు పాలనను తిప్పి కొట్టాలని భారత కార్మిక సంఘాల సమాఖ్య (ఇఫ్టూ) జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు కొత్తపల్లి రవి, బిల్లకంటి సూర్యంలు డిమాండ్ చేశకరపత్రాలను ఆవిష్కరిస్తున్న ఇఫ్టూ జిల్లా అధ్యక్షులు కొత్తపల్లి రవి ారు. మహబూబాబాద్‌లో ప్రజాపంథా జిల్లా కార్యాలయంలో మంగళవారం కరపత్రాలను ఆవిష్కరించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ.. అంతర్జాతీయ కార్మిక హక్కుల పోరాట దినం మే 1న పెద్ద ఎత్తున నిర్వహించడానికి కార్మిక వర్గం సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. కార్మికుల 8 గంటల పనిని 12 గంటలుగా మార్చి సంఘం పెట్టుకునే హక్కు, సమ్మె చేసే హక్కును, వేతనాలు పెంచుకునే హక్కును రద్దు చేసిన మోదీ ప్రభుత్వం కార్మిక వ్యతిరేక విధానాలపై పోరాడాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో భాస్కర్‌రెడ్డి, సంపత్‌కుమార్, బలరాం, ప్రసాద్ పాల్గొన్నారు.

10 లీటర్ల గుడుంబా పట్టివేత

డోర్నకల్, ఏప్రిల్ 23 : అక్రమంగా గుడంబా తయారు చేస్తున్న ఇంటిపై దాడులు నిర్వహించి, మహిళలపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై తిరుపతి తెలిపారు. ఎస్సై తెలిపిన వివరాల ప్రకారం. రామకుంట తండాకు చెందిన రాజమ్మ అనే మహిళ కొంతకాలంగా గుడుంబా తయారు చేసి విక్రయిస్తున్నట్లు వచ్చిన సమాచారం మేరకు ఆమె ఇంటిపై దాడులు నిర్వహించినట్లు చెప్పారు. ఈ దాడుల్లో 10 లీటర్ల గుడుంబాను స్వాధీనం చేసుకుని రాజమ్మపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

విద్యుదాఘాతంతో పాడిగేదె మృతి

గార్ల, ఏప్రిల్ 23 : తహసీల్దార్ కార్యాలయం సమీపంలో విద్యుత్‌ఘాతంతో పాడిగేదె మృతి చెందిన ఘటన మంగళవారం జరిగింది. సోమవారం రాత్రి వీచిన ఈదురుగాలులకు విద్యుత్ స్తంభాలు నేలకు వంగిపోగా విద్యుత్ వైర్లు తెగిపడ్డాయి, దీంతో గార్లలో బాడిస లక్ష్మి చెందిన పాడిగేదెలను రోజువారిగా మేతకు విడి పెట్టారు. అదే సమయంలో అటుగా వెళ్లిన గేదల్లో ఒకటి విద్యుదాఘాతానికి గురై మృత్యువాత పడింది. చని పోయిన గేదె విలువ సుమారు రూ.లక్ష ఉంటుందని లక్ష్మీ విలపిస్తూ తెలిపింది.

కార్మిక వ్యతిరేక, మతోన్మాద బీజేపీని ఓడించండి

● సీఐటీయూ రాష్ట్ర నాయకురాలు మాధవి


సమావేశంలో మాట్లాడుతున్న కాసు మాధవి

మహబూబాబాద్ టౌన్, ఏప్రిల్23 : కేంద్రంలో పదేళ్లుగా అధికారంలో ఉంటూ కార్మిక వ్యతిరేక విధానాలను అవలంబిస్తున్న మతోన్మాద బీజేపీని ఓడించాలని సీఐటీయూ రాష్ట్ర నాయకురాలు కాసు మాధవి పిలుపునిచ్చారు. మహబూబాబాద్ పెరుమాండ్ల జగన్నాథం భవన్‌లో మంగళవారం సీఐటీయూ జిల్లా కమిటీ సమావేశాన్ని ఆకుల రాజు అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా హాజరైన ఆమె మాట్లాడుతూ బీజేపీ ప్రభుత్వం కార్పొరేట్, పెట్టుబడిదారుల ప్రయోజనాల కోసం 29 కార్మిక చట్టాలను సవరించి నాలుగు లెబర్‌కోడ్‌లను తీసుకువచ్చిందని దుయ్యబట్టారు. రవాణారంగ కార్మికుల ఉపాధిని దెబ్బతీసేలా మోటారు వాహనాల చట్టాన్ని సవరించిందని, స్కీం వర్కర్లను కార్మికులుగా గుర్తించకుండా శ్రమ దోపిడికి పాల్పడిందన్నారు.నిత్యావసర సరుకుల ధరలు పెరిగి, నిరుద్యోగం వంటి సమస్యలతో ప్రజలు సతమతమవుతున్నా పరిష్కారానికి పాలకులు కృషి చేయాలేదని విమర్శించారు. దేశ ఆర్థిక సార్వభౌమత్వం, ప్రజాస్వామ్యపరిరక్షణ కోసం కార్మికవర్గం తమ ఓటుతో బీజేపీ ఓడించి ఇండియా కూటమిని గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. సీఐటీయూ జిల్లా కార్యదర్శి కుంట ఉపేందర్ మాట్లాడుతూ కార్మిక చట్టాలను సవరించి కార్మికులను కట్టుబానిసలుగా మార్చిన కేంద్రప్రభుత్వ విధానాలను నిరిసిస్తూ మేడేను నిర్వహించుకోవాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో సీఐటీయూ నాయకులు సమ్మెట రాజమౌళి, కుమ్మరికుంట్ల నాగన్న, స్నేహబిందు, జయరాజు, తోట శ్రీనివాస్, వాసం దుర్గారావు, వీరన్న, వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

నేడు వరంగల్‌లో జనజాతర సభ


(5వ పేజీ తరువాయి)

అలాగే వరంగల్ నగరానికి నిధులు, కాకతీయ మెగా టెక్స్‌టైల్ పార్కు, విమానాశ్రయం తదితర అంశాలపై ఓరుగల్లు ప్రజలకు సీఎం హామీలు ఇచ్చే అవకాశం ఉందనే చర్చ జరుగుతోంది. కాగా, పార్లమెంట్ ఎన్నికల నోటిఫికేషన్ తరువాత తొలిసారి సీఎం రేవంత్‌రెడ్డి వరంగల్‌కు వస్తుండటంతో కాంగ్రెస్ పార్టీ విస్తృత ఏర్పాట్లు చేస్తోంది. ఎమ్మెల్యేలు కడియం శ్రీహరి, నాయిని రాజేందర్‌రెడ్డి, ప్రకాష్‌రెడ్డి, నాగరాజు, గండ్ర సత్యనారాయణరావు సభ ఏర్పాట్లపై ప్రత్యేకంగా దృష్టిపెట్టారు.

సభా స్థలిని పరిశీలించిన ఎమ్మెల్యేలు, సీపీ

మడికొండ : మడికొండలో బుధవారం జరగనున్న కాంగ్రెస్ జనజాతర సభా స్థలాన్ని మంగళవారం ఎమ్మెల్యేలు కడియం శ్రీహరి, రేవూరి ప్రకాశ్‌రెడ్డి, కె.ఆర్. నాగరాజ్, వరంగల్ పోలీస్‌కమిషనర్ అంబర్‌కిషోర్‌ఝా సందర్శించి సభా ప్రాంగణంలో ఏర్పాట్లను పరిశీలించారు. సభకు వచ్చే ప్రజలకు ఇబ్బందులు కలుగకుండా అన్నిఏర్పాట్లు నిర్వాహకులకు సూచించారు. సీపీ అంబర్ కిషోర్‌ఝా మాట్లాడుతూ ఏడు నియోజకవర్గాల నుంచి వచ్చే వాహనాలకు ఎక్కడి కక్కడ ఏర్పాట్లు చేయడమే కాకుండా ట్రాఫిక్ సమస్య తలెత్తకుండా జాగ్రతలు తీసుకుంటున్నామన్నారు.

పురుగుల మందుతాగిన యువకుడు మృతి


భూక్య అశోక్ (ఫైల్)

మహబూబాబాద్ రూరల్, ఏప్రిల్ 23 : చికిత్స పొందుతూ యువకుడు మృతి చెందిన ఘటన మహ లక్ష్మాతండాలో మంగళవారం చోటు చేసుకుంది. మానుకోట రూరల్ ఎస్సై దీపికరెడ్డి తెలిపిన వివరాల ప్రకారం. లక్ష్మాతండాకు చెందిన భూక్య అశోక్ (28) వ్యవసాయ కూలీ పనులు చేసుకుంటూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. గత కొద్దిరోజుల క్రితం అశోక్ టీబీ బారిన పడ్డాడు. విషయం తెలుసుకున్న భార్య రేణుక ఇంటి నుంచి బయ్యారం మండలం బలాజీపేటలోని పుట్టింటికి వెళ్లిపోయింది. టీబీ జబ్బు తగ్గకపోవడం, భార్యవెళ్లిపోవడంతో మనస్తాపానికి గురైన అశోక్ ఈనెల 15న పురుగుల మందు తాగాడు. పక్కింటివారు కుటుంబసభ్యులకు సమాచారం ఇచ్చి వెంటనే చికిత్స నిమిత్తం జిల్లా ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ సోమవారం అర్థరాత్రి అశోక్ మృతి చెందాడు. మృతుడికి భార్య రేణుక, ఇద్దరు కుమారులు ఉన్నారు.

కోరం లేక మండల సభ వాయిదా : ఎంపీడీవో

మహబూబాబాద్ రూరల్, ఏప్రిల్ 23 : పార్లమెంట్ ఎన్నికల కోడ్ అమల్లో ఉం డడంతో ఎంపీటీసీలు గైర్హాజరుతో కోరంలేక మహబూబాబాద్ మండల సభను వాయిదా వేసినట్లు ఎంపీడీవో బానోత్ రవికుమార్ మంగళవారం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పార్లమెంట్ ఎన్నికల కోడ్ అ మల్లో ఉండడంతో ఎంపీటీసీలు మండల సభకు హాజరు కాలేదు. దీంతో కోరంలేక మండల సభను వాయిదా వేసినట్లు చెప్పారు. తిరిగి ఎప్పుడు నిర్వహించేది తేదీని ఖరారు చేసి సమాచారం అందిస్తామని ఆయన వివరించారు.

ఉత్తమ ప్రమాణాలతో బోధన

డోర్నకల్, ఏప్రిల్ 23 : ప్రభుత్వ పాఠశాలల్లో మంచి విద్యాప్రమాణాలు కలిగిన ఉపాధ్యాయులు ఉన్నారని, విద్యార్థుల తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలని డోర్నకల్ జడ్పీహైస్కూల్ హెచ్ఎం బండి నర్సింహారావు అన్నారు. మంగళవారం డోర్నకల్ జడ్పీ హైస్కూల్‌లో ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా హెచ్ఎం మాట్లాడుతూ.. రానున్న రెండు సంవత్సరాల్లో జడ్పీ హైస్కూల్లో నూరుశాతం ఉత్తీర్ణత సాధించేందుకు ప్రణాళికలు రూపొందించినట్లు చెప్పారు. సమావేశంలో ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

బలరాంనాయక్ గెలుపే లక్ష్యంగా పనిచేయాలి

గార్ల, ఏప్రిల్ 23 : మహబూబాబాద్ పార్లమెంటు నియోజక వర్గంలో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి పోరిక బలరాంనాయక్ గెలుపే లక్ష్యంగా కార్యకర్తలు పనిచేయాలని మండల కాంగ్రెస్ కార్యనిర్వాహక అధ్యక్షుడు తాళ్లపల్లి కృష్ణాగౌడ్ కోరారు. మంగళవారం స్థానిక పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. మాజీ ఎంపీపీ మాలోత్ వెంకట్‌లాల్ నాయక్, నాయకులు షంషాద్‌బేగం, జర్పుల పృథ్వీనాయక్, దీకొండ రాము, ధరవత్ వీరన్న, మాలోత్ గిరి, మురళి, కల్యాణ్, సత్యం పాల్గొన్నారు.

ఇరువర్గాల మధ్య ఘర్షణ

గార్ల ఏప్రిల్23 : మండల పరిధిలోని పాత పోచారంలో ఇంటిముందు ఉన్న చింతచెట్టు కొమ్మల విషయంపై ఇరు వర్గాల మధ్య జరిగిన గొడవలో ఇద్దరికి తీవ్ర గాయాలపాలైన ఘటన మంగళవారం జరిగిందని, దాడికి పాల్పడిన ఇద్దరిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై జీనత్‌కుమార్ తెలిపారు. పోలీసుల తెలిపిన వివరాలివున్నాయి. గ్రామానికి చెందిన గోనె రాంమూర్తి ఇంట్లో ఉన్న చింతచెట్టు కొమ్మలు పప్పుల సురేందర్ ఇంట్లోకి వచ్చాయి. మా ఇంట్లోకి వచ్చిన కొమ్మలు కొట్టించాలని సురేందర్ రాంమూర్తి ఇంటికెళ్లి అడుగగా ఇరువురి కుటుంబసభ్యుల మధ్య ఘర్షణ జరిగింది. ఈ ఘర్షణలో రాంమూర్తి, శశికుమార్ తలలకు తీవ్రగాయాలయ్యాయి. రాంమూర్తి మనుమడు శశికుమార్ ఫిర్యాదు మేరకు రాంమూర్తి, ముత్తమ్మపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తునట్లు ఎస్సై పేర్కొన్నారు

'నేటి సీఎం పర్యటనను విజయవంతం చేయాలి'

తొర్రూరు, ఏప్రిల్ 23 : హన్మకొండ జిల్లా మడికొండలో వరంగల్ కాంగ్రెస్ పార్లమెంట్ అభ్యర్థి కడియం కావ్య గెలుపును కోరుతూ నిర్వహించే సభకు సీఎం రేవంత్ రెడ్డి హాజరవుతున్న నేపథ్యంలో ఆసభను విజయవంతం చేయాలని కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు సోమ రాజశేఖర్ అన్నారు. మంగళవారం పట్టణ కేంద్రంలో ఆయన మాట్లాడుతూ.. కాంగ్రెస్ అభ్యర్థి కడియం కావ్యను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. వరంగల్ పార్లమెంట్ పరిధిలోని 7నియోజకవర్గాల నుంచి కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో హాజరవుతారని తెలిపారు. పాలకుర్తి నియోజకవర్గం నుంచి సుమారు 10వేల మంది కార్యకర్తలు ఈసమావేశానికి తరలుతున్నట్లు ఆయన తెలిపారు. మండలంలోని అన్ని గ్రామాల కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు భారీ సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని ఆయన కోరారు.

ఎంపీ కవిత ప్రత్యేక పూజలు

కురవి, ఏప్రిల్ 23 : కురవి శ్రీవీరభద్రస్వామి దేవాలయంలో మహబూబాబాద్ పార్లమెంట్ బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి మాలోతు కవిత మంగళవారం ప్రత్యేక పూజలు జరిపారు. మానుకోటలో నామినేషన్ వేయడానికి ముందు నామినేషన్ పత్రాలను వీరభద్రుడి సన్నిధిలో ఉంచి పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా కవిత ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు బజ్జూరి పిచ్చిరెడ్డి, గుగులోతురవి, హరిత, డీఎస్.రాజేంద్రప్రసాద్, నూతక్కి నర్సింహారావు, పొరెడ్డి రాంరెడ్డి, కొంతం విజయ్, బండి యతిరాజ్, యానాల గంగాధర్‌రెడ్డి, ఆమెడ మల్లికార్జున్, నూతక్కి సాంబశివరావు, కిన్నెర మల్లయ్య, దుడ్డెల వినోద్, శ్రీను పాల్గొన్నారు.

జాతీయస్థాయి రగ్బీ పోటీలకు మమత

కురవి, ఏప్రిల్23 : రాజోలు జడ్పీహెచ్ఎస్‌కు చెందిన దారావత్ మమత జాతీయస్థాయి ఎస్‌జీఎఫ్ రగ్బీ పోటీలకు ఎంపికైందని హెచ్ఎం ఆళ్ల రవికుమార్, పీఈటీ దార్ల సునీల్ తెలిపారు. ఏప్రిల్ 13 నుంచి 15 వరకు తొర్రూరులో జరిగిన అండర్-17 బాలికల రగ్బీ పోటీల్లో ప్రతిభ చూపిన మమత జాతీయస్థాయి పోటీలకు ఎంపికైనట్లు తెలిపారు. ఏప్రిల్ 24 నుంచి 30 వరకు మహారాష్ట్ర పూనెలో జరిగే జాతీయస్థాయి పోటీల్లో తెలంగాణ తరుపున మమత పాల్గొననున్నట్లు వెల్లడించారు. విద్యార్థిని మమతను ఉపాధ్యాయులు దామోదర్‌రెడ్డి, బిక్కు, సురేష్, లింగమూర్తి, రవికుమార్, వీరభద్రం, వీరన్న, అఫ్జల్, ప్రభాకర్, శ్రీదేవి అభినందించారు.

బాస్కెట్‌బాల్ పోటీలకు చింతపల్లి విద్యార్థులు

సీరోలు : హైదరాబాద్‌లో ఈనెల 25 నుంచి 28 వరకు జరిగే రాష్ట్రస్థాయి బాస్కెట్ బాల్ పోటీలకు 5 గురు విద్యార్థులు ఎంపికైనట్లు హెచ్ఎం బి.శంకర్ తెలిపారు. చింతపల్లి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో మంగళవారం అండర్-18 రాష్ట్రస్థాయి బాస్కెట్ బాల్ పోటీలకు ఎంపికైన విద్యార్థులను అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇటీవల మహబూబాబాద్‌లో జరిగిన జిల్లా స్థాయి పోటీల్లో పాఠశాలకు చెందిన వర్షిత్, మహేశ్వరీ, శ్వేత, సౌమ్యశ్రీ, దీప్తిక ఉత్తమ ప్రతిభ కనబరిచి రాష్ట్రస్థాయికి ఎంపికైనట్లు తెలిపారు. వ్యాయామ ఉపాధ్యాయుడు పిల్లి కమల్‌కిషోర్, ఉపాధ్యాయులు అజ్గర్, సలీం, సోమనాథరాజు, లలిత, లావణ్యకుమారి, రాధిక, అనిత పాల్గొన్నారు.

విద్యార్థులు ఎండలో తిరగొద్దు

మరిపెడ రూరల్, ఏప్రిల్ 23 : విద్యార్థులు వేసవిలో ఎండలో తిరగకుండా ఇంటి వద్దనే ఉంటూ చదువుపై ఆసక్తి చూపాలని హెచ్ఎం భర్తాపురపు మురళీధర్ అన్నారు. మంగళవారం గాలివారిగూడెం పాఠశాలలో విద్యార్థులకు ప్రోగ్రెసివ్ కార్డులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. వేసవి సెలవులు బుధవారం నుంచి జూన్ 12 వరకు ఉంటాయన్నారు. ఈ సెలవులలో విద్యార్థులు చదువుపై శ్రద్ధ వహించాలని కోరారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు లింగాల మహేష్‌గౌడ్, గుగులోతు వెంకన్న, షేక్ పైజోద్దీన్, గుగులోతు బాలు, విద్యార్థులు పాల్గొన్నారు.

త్వరగా ఇంటికి తిరిగి రావాలి..

● దంతాలపల్లి : ఉపాధి కూలీలు ఎండ తీవ్రత ఎక్కు వ కాకముందే పనులు ముగించుకుని ఇంటికి చేరుకోవాలని ఏపీవో రామకృష్ణ తెలిపారు. మంగళవారం ఆగపేట, తూర్పుతండా, గున్నేపల్లి గ్రామాల్లో జరుగుతున్న ఉపాధి పనులను పరిశీలించి కూలీలకు ఆయన తగు సూచనలు చేశారు.

దుర్గామాత ఆశీస్సులతో సంక్షేమం : ఎంపీపీ

పెద్దవంగర, ఏప్రిల్ 23 : దుర్గామాత ఆశీస్సులతో అన్ని విధాలా సంక్షేమం చేకూరుతుందని, ప్రజల సుభిక్షం కోసమే గ్రామదేవతలను పూజించడం జరుగుతుందని ఎంపీపీ బొమ్మెరబోయిన కల్పనరాజు యాదవ్ అన్నారు. మంగళవారం పడమటితండాలో దుర్గామాత వేడుకల్లో పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. పాలకుర్తి దేవస్థాన మాజీ చైర్మన్ రామచంద్రయ్యశర్మ, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు ఈదురు ఐలయ్య, ఎంపీటీసీలు విజయసోమన్న, రవీందర్, ఎర్ర సబితవెంకన్న, బీఆర్ఎస్ నాయకులు, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు ముద్దసాని సురేష్ పూజలు చేశారు.

నాగేంద్రస్వామి ఆలయ వార్షికోత్సవం

తొర్రూరు, ఏప్రిల్ 23 : డివిజన్ కేంద్రంలోని శ్రీ పంచముఖ నాగేంద్రస్వామి ఆలయ 18వ వార్షికోత్సవ వేడుకలు మంగళవారం ఆలయ అర్చకులు అత్యంత వైభవోపేతంగానిర్వహించారు. తెల్లవారు జామునుంచే స్వామివారికి పంచామృత అభిషేకం, అర్చన, అష్టోత్తరం, అశేషపూజ, అశ్వత్థా నారాయణ కల్యాణ మహోత్సవం నిర్వహించారు. ప్రధాన అర్చకుడు ఓలేటి గీతాచార్యులు, ఆలయ కమిటీ సభ్యులు గోపారపు నాగేశ్వర్ రావు, చకిలేల నాగరాజు, కల్లూరి నాగేంద్రచారి, నాగేశ్వర ప్రసాద్, వనమాల నాగేశ్వర్‌రావు, అర్చకులు యాదగిరాచార్యులు, వెంకటాచార్యులు, రఘు, వేణు, విక్రమ్ శర్మ, భక్తులు పాల్గొన్నారు.

దంతాలపల్లిలో కదిలే ఇల్లు


రేకుల ఇల్లు

దంతాలపల్లి, ఏప్రిల్ 23 : పట్టణాల్లో కనిపించే కంటైనర్ హోమ్ నేడు పల్లెలోకి దర్శనమిచ్చాయి. మహబూబాబాద్ జిల్లా దంతాలపల్లికి చెందిన వ్యాపారి గుమడవెల్లి రాజన్న రూ.10లక్షలతో నిర్మించిన కంటైనర్ ఇల్లును హైదరాబాద్ నుంచి మంగళవారం భారీ వాహనంపై తీసుకొవచ్చారు. ఈ ఇల్లు 13.6 ఫీట్లు వెడల్పు, 42 ఫీట్ల పొడవుతో రెండంతస్థుల భవనంగా 15 రోజుల్లో నిర్మించి ఇచ్చినట్లు తెలిపాడు. కంటైనర్ హోమ్‌లైఫ్ 25 సంవత్సరాలుగా ఉంటుందని కంటైనర్ తయారుదారులు పేర్కొన్నారు. ఈ ఇంట్లో బాత్‌రూంతో పాటు, హాలు, బెడ్‌రూం, షాపుకు ఉపయోగపడేలా తయారు చేశారన్నారు. ఇందులో ఆధునికమైన బాత్‌రూం, టాయిలెట్, సిలింగ్, విద్యుత్ అమర్చారన్నారు.

ప్రజల అవసరాలను గుర్తించాలి

తొర్రూరు, ఏప్రిల్ 23 : ప్రభుత్వాలు ప్రజల అవసరాలను గుర్తిస్తూ వారికి సౌకర్యాలు కల్పించాలని రైలులో 5సాధారణ బోగీల సాధన సమితి జాతీయ కన్వీనర్ పరికిపండ్ల అశోక్ అన్నారు. మంగళవారం తొర్రూరులో కోటి ఉత్తరాల కార్యక్ర మం నిర్వహించారు. అనంతరం వారి డిమాండ్లను తెలుపుతూ ఉత్తరాలు రాశారు. సీనియర్ సిటిజన్స్ వెంకన్న, సుధాకర్, సాగర్, అశోక్, పాష, రమేష్, నవీన్ ఉన్నారు.